AL - HiLaL


నవలవంక

మహమ్మదీ హిజ్రి శకం 1433

Vol 9, Issue: 71 September - 2012 nelavankaonline.com

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

అంకురం అంకితం



جمعية النجاة الخيرية

IPC


لجنة التعريف بالإسلام

ISLAM PRESENTATION COMMITTEE


بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ



“మరి ఆయన శక్తి సూచనల్లోని ఒక సూచన - ఆయన మీ కోసం స్వయంగా మీ నుండే భార్యలను సృజించాడు. మీరు వారి వద్ద ప్రశాంతత పొందడానికి! ఆయన మీ మధ్య ప్రేమానురాగాల ను, దయాభావాన్ని పొందుపర్చాడు. నిశ్చయంగా ఆలో చించేవారి కోసం ఇందులో ఎన్నో సూచనలు న్నాయి. భూమ్యాకాశాల సృష్టి, మీ భాషల్లో, రంగుల్లో ఉన్న వైవిధ్యం కూడా ఆయన (శక్తి) సూచనలలోనివే. జ్ఞాన సంపన్నుల కోసం ఇందులో పలు సూచనలున్నాయి”.
(దివ్య ఖుర్ఆన్ - 30: 21,22)



“ఇంకా ఆయన (శక్తి) సూచనలలో రాత్రి వేళ, పగటి పూట మీరు నిద్రపోవడం, మీరు ఆయన కృపను (జీవనోపాధిని) అన్వేషించ డం కూడా ఉంది. (జాగ్రత్తగా) వినేవారికి ఇందులో అనేక సూచనలున్నాయి. ఆయన సూచనలలోని మరోక సూచన ఏమిటంటే, ఆయన మిమల్ని భయపెట్టడానికి, ఆశ పెట్టడానికి మెరుపును చూపిస్తున్నాడు. ఆకాశం నుండి వర్షం కురిపిస్తున్నాడు. ఇందులో కూడా బుద్ధి జీవుల కోసం ఎన్నో నిదర్శనాలున్నాయి”.
(దివ్య ఖుర్ఆన్ - 30: 23, 24)



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HiLaL
వెలువరక
మాస పత్రిక

(AL-HILAL MONTHLY)

Vol 9, ISSUE: 71
September - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

IPC
ISLAM PRESENTATION COMMITTEE

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net

ఈ సంచికలో....



తెలుగు - వెలుగు



సామాజిక రుగ్మతలు పరిష్కారం



హజ్ ఆదేశాలు ఆదాబులు



అంకురం - అంకితం	2	హజ్ ఆదేశాలు ఆదాబులు	10
తెలుగు వెలుగు కోసం ప్రతిన పూనుదాం!	3	కవితా కుసుమాలు	12
సామాజిక రుగ్మతలు పరిష్కారం	4	ప్రాపంచిక వ్యామోహపరులు	13
సత్య లేఖ	6	ధార్మిక గ్రంథాల వెలుగులో దేవుడు?	14
ముస్లిం జీవితానికి సంబంధించిన...	7	ఐపిసి వార్తలు	16
స్వర్గధామం	8	నరక కూపం	18
ఇస్లాం, ముస్లిం గురించి అవగాహన	9	కుటుంబ జీవనం మరియు ఇస్లాం	20
		నెలవంక ఉత్తరాలు.	21

كلمة العدد- كيف نحافظ على اللغة - حل امراض المجتمع - رسالة الحق - خذ عقيدتك من الكتاب والسنه - صفة الجنة - معنى الإسلام والمسلم أحكام وآداب الحج - نشيد - عبد الدينار والدرهم - وحدانية الله في الأديان المعاصرة - اخبار اللجنة - صفة النار - نظام الأسرة في الرسلام - رسائل الهلال

అంకురం అంకితం



ఆంధ్ర సాహిత్యం రెండు వేల సంవత్సరాల పంట. ఆ రెండు వేల సంవత్సరాలలో వేనవేల కావ్యాలు, తత్వాలు, సిద్ధాంతాలు పుట్టాయి. 8 కోట్ల మంది ఆంధ్ర ప్రజల్లో తెలుగు మాట్లాడే వారు 87.77/ శాతం అయితే ఉర్దూ మాట్లాడేవారి శాతం 8. 63/, హిన్దీ మాట్లాడేవారి శాతం 2. 77/, తమిళ్ మాట్లాడేవారి శాతం 1. 13/గా ఉంది. యుగాలు గడిచినా, తరాలు మారినా ఆరుద్ర అన్నట్టు నేటికీ - **తేనెకన్నా మధురంరా తెలుగు. ఆ తెలుగుదనం మన కంటికి వెలుగు. మన గత చరిత్ర ఎంత ఖ్యాతి? గర్వించదగ్గ జాతి తెలుగు జాతి!**

మతం కొందరినే మేల్కొల్పుతుంది. రాజకీయం కొందరినే రగుల్కొలుపుతుంది. హితం కూడిన పదునయిన పదం - విశ్వశాంతి అదనెరిగిన సాహిత్యం అందరినీ మేల్కొల్పుతుంది అనడానికి దైవగ్రంథాల చరిత్రే సాక్షి! అందుకే అసలైన సాహిత్యం విశ్వ జనీనం, సార్వకాలికం. ఆ విషయంలో అంతిమంగా అవతరించిన ఖుర్ఆన్ అగ్రగణ్యం, అశేషం, అమోఘం, అమేయం, అద్వితీయం. అది ఆంగ్లీకరించబడటం మన అదృష్టం. దాన్ని తెనుగీకరించిన భావానువాదకర్తల జీవితం ధన్యం. అట్టి మహిమాన్వితి గ్రంథరాజాన్ని ప్రామాణికబద్ధంగా తెనుగీకరించాలని సంకల్పించి ఐపిసి సంస్థ తన ఉనికికి సార్థకతను చేకూర్చుకుంది. 1994 నుంచి ఐపిసి ప్రచురించిన తెలుగు పుస్తకాల గురించి, దాని పరిమళ దశల గురించి ముచ్చటించుకుందాం!

'ఎవరో ఒకరు, ఎపుడోకపుడు' అన్నట్టు షేక్ ఇస్హాక్ అలీ, సోదరులు నజీబుద్దీన్, మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ, మౌలానా అబ్దుస్సలామ్ ఉమ్రీ, మౌలానా మౌదూద్ ఆజమ్ గార్ల నేతృత్వంలో కువైట్ జీవధాత్రిపై చేతి వ్రాతతో మొదలయిన ఈ ప్రస్థాన అంకురం కరపత్రాలతో చిగురించి, చిరు పుస్తకాలు - క్యాసెట్లతో పుష్పించి, జుమా ప్రసంగాలతో ఫలించి నేడు **నెలవంక** మాస పత్రిక రూపంలో ఆధ్యాత్మిక జనాభ్యుదయానికి అంకితమయి తెలుగు జనావళి నివాళులందుకోంటోంది. ఇది తెలుగు పత్రిక-సాత్వికతకు ఇది ప్రతీక. మమత మందారంలా వికసించాలని, మానవత్వం త్రివిక్రమించాలని ప్రయత్నించే చిరు దీపిక. **"నిప్పులు చెరిగే వేసవితోనే - తేనెలు కురిసే వానొస్తుంది. ఆకులు రాల్చే కాలంతోనే-చిగురులు తొడిగే ఘడియొస్తుంది"** అన్నట్టు జీవితంలోఎదురయ్యే సమస్యలను ఎలా సమన్వయ పర్చుకోవాలనే సందేశం **నెలవంక**లో ధ్వనిస్తుంది. సౌమనస్యానికి అది పునాది. వైమనస్యానికి అది విరోధి.

ప్రస్తుతం 7299 భాషలు ప్రపంచంలో వాడకంలో ఉన్నట్లు గుర్తించిన సంస్థలు, వాటిలో సగానికి సగం రాబోయే తరానికి అందకుండా అంతరించిపోయే దశలో ఉన్నాయని చెబుతున్నాయి. ఇక అంతరించే దశలో ఒక భాష ఉందనడానికి ఛాయలు ఏమిటంటే-
1. ఆ భాషను పెద్దవాళ్లు పిల్లలకు నేర్పరు. 2. దైనందిన జీవితంలో దాన్ని అంతగా వాడరు. 3. ఆ భాష మాట్లాడే జనం సంఖ్య తగ్గిపోతుంటుంది. 4. ప్రభుత్వం, ఆధ్యాత్మిక క్షేత్రాలు కూడా ఆ భాషను ఉపయోగించవు. 5. ఆ భాషను కాపాడుకోవాలని ప్రజలు ఉద్యమించరు. 6. ఆ భాష పట్ల గౌరవం ప్రజల్లో ఉండదు. 7. ఆ భాష అక్షరాలనుగాని, సాహిత్యాన్ని గానీ ప్రజలు విరివిగా వాడరు. ప్రపంచంలో ఏ దేశంలోనయినా, మాతృభాష రాచభాష కాలేనప్పుడు జరిగేది ఇదే!



అయితే అభ్యుదయ కవులు, సాహితీవేత్తలు, మాతృభాషాభిమానులు తెలుగు పతాకాన్ని దశ దిశలా ఎగుర వేసేందుకు, తెలుగు దివ్వె వెలుగులను ప్రపంచానికి పంచేందుకు, తెలుగు జాతి గౌరవాన్ని లోకానికి చాటేందుకు ప్రతిన బూనటం, ఈ బృహత్తర కృషికై కంకణం కట్టుకోవడం నిజంగా అభినందించదగ్గ విషయం. మహా కవి శ్రీశ్రీ అన్నట్టు **'నేను సయితం....'** మనలోని ప్రతి ఒక్కరు ఈ కార్యసిద్ధి కోసం ముందుకు రావాలి. అక్షర అస్త్రాల ద్వారా అసత్యాన్ని, అరాచకాన్ని, అన్యాయాన్ని పారద్రోలాలి. ఆ మేరకు-సామాజిక న్యాయం, సమాజాభ్యుదయం కోసం మీరు ప్రతిపాదించే ప్రతి మంచి విషయాన్ని **నెలవంక** సహృదయంతో స్వాగతిస్తోంది.

మన తెలుగు జాతి తెలుగు ఖ్యాతిని మరచి మత్తుగా నిద్రపోతోంది అని ఆందోళన చెందే బాధాతప్త ఆంధ్రాభిమానులు కొందరున్నారు. వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదు. **'నిద్ర సగం మృత్యు. జీవులకు ఇది ఏ నాడూ తప్పదు'** అన్న మాట నిజమే కావచ్చు. **అంత మాత్రాన నిద్ర కాదు గెలిచేది - జాగృతి. తమస్సు కాదు నిలిచేది - ఉషస్సు.** కాంతి చైతన్యమానం. ఆ కాంతిని మన అణువణువులో నింపుకుందాం! మనం వేసే అంకురం ఎంత చిన్నదయినా సరే దాన్ని పూర్తి చిత్తశుద్ధితో తెలుగుజాతికి అంకితం చేద్దాం!!

తెలుగు తెలుగు

కోసం ప్రతిన పూనుదాం!

(సంక్షిప్తంగా)



'తెలుగునకు పర్యాయపదమై వెలుగు వికసించె, వెలుగునకు ఆమ్రేడితమ్మై తెలుగు వినిపించె' కవితా పయోనిధి దాశరథి భావోద్వేగాలకు అక్షర రూపమది.

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ...గతమెంతో ఘనకీర్తి కలవోడ' అన్న వేములపల్లి శ్రీ కృష్ణ ప్రబోధాత్మక గీతం మూడు నాలుగు దశాబ్దాల క్రితం తెలుగునాట మార్మోగిపోయేది. తెలుగుఆట, తెలుగుపాట, తెలుగు నుడికారం, తెలుగు మమకారం–సంక్రాంతికి వేసిన రథం ముగ్గులా మున్నూట అరవై అయిదురోజులూ జాతి మనోరథమై సాగి, ముంగిళ్లలో తెలుగుదనాన్ని రాశులు పోసిన రోజులవి.

కాలం మారింది. **'గతమెంతొ ఘనకీర్తి'** పాటా ఆగింది. తెలుగు నుడికారం బడికి దూరమైంది. యాభయ్యారక్షరాల వర్ణ మాల తెలుగింటికి భారమైంది. సొంతింటి లోనే అమ్మ భాషకు ఆదరణ కొరవడిన వేళ, తియ్యందనాల తెలుగు మళ్ళీ ఇంటింటి వెలుగు కావాలన్న శుభసంకల్పంతో – తెలుగు భాషా వికాస మహోద్యమం కోసం ఉద్భవించిన **'రామోజీ ఫౌండేషన్'** విస్పష్ట కార్యాచరణతో ముందడుగేస్తోంది!

'సంస్కృతికి మూల హేతువు మనిషిలో వికసించిన విజ్ఞాన ధాతువు' అన్నారు సినారె. సహస్రాబ్దాల సంస్కృతీ వారసత్వం, మరే భాషకూ లేని తలకట్టు ధీమత్వంతో జేగీయమానమై తరతరాలుగా తెలుగువారి విజ్ఞాన దాహార్తిని తీరుస్తూ వచ్చింది మన మాతృ భాషే. అలాంటి కామధేనువును కాలదన్ని కాలధర్మమనే కబేళాకు తోలడం సరైనదేనా? పొరుగున తమిళ, కన్నడ సోదరులూ అలాగే చేస్తున్నారా? లేదు లేదన్నదే సమాధానం. వాళ్ళలా అమ్మభాషను అక్కున చేర్చుకొనే పవిత్ర యజ్ఞంలో భాగస్వాములం కావాలి మనందరం! ఉద్యోగమైనా, సద్యోగమైనా ఆంగ్ల భాషే బతుకు తెరువన్న వెర్రిభ్రమల మాయమబ్బు దశాబ్దాలుగా తెలుగుగడ్డపై దట్టంగా ముసురేసింది. రాజ్యభాషగా తెలుగును గుర్తించి, గౌరవించలేని పాలకుల ఏలుబడిలో మాతృభాష ఉనికి మనికి ప్రశ్నార్థకమైపోయాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞాన సాగర మథనంలో నిత్య నూతనావిష్కరణలను భావితరం ఆదరంగా అందిపుచ్చుకొంటున్నా ఆయా వస్తు సేవలకు తెలుగు పేర్లు లేవు. కాబట్టే రేపటి పౌరులకు తెలుగు భాష అక్కరకు రానిదవుతోంది. పాలకుల అలక్ష్యం, పాలితుల ఉదాసీనత తెలుగువారి నోట తేట తెనుగు పూటలు కనుమరుగు కావడానికి కారణం. లొసుగులూ లోపాల్ని పూరించుకొంటూ తెలుగు భాషకు అమృతత్వాన్ని సాధించాలన్నదే మా సత్సంకల్పం.

వ్యావహారిక భాషోద్యమంతో తెలుగునాట పెను సంచలనం సృష్టించినవారు గిడుగు రామ్మూర్తి పంతులు. మాతృ భాషకు మహోజ్జ్వల భవితను ఆశిస్తూ ప్రతి తెలుగువాడు తనవంతు తోడ్పాటును అందించడానికి ప్రతిన పూనాలి. అమ్మభాషపై మమకారాన్ని పంచే మహోద్దేశంతో ఏర్పాటైన ఈ ఫౌండేషన్ తన 'తెలుగు వెలుగు' సప్తవర్ణ మాసపత్రిక తొలిసంచికను నేడే ఆవిష్కరిస్తోంది. తెలుగువాడిలో నిద్రాణమై ఉన్న జాతీయతా స్ఫూర్తిని తట్టి లేపి, దేశ విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఉమ్మడి వేదికగా నిలవడమే లక్ష్యంగా తెలుగు వెలుగుతో పాటు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలనీ ఈ ఫౌండేషన్' నిర్ణయించింది. పిల్లల కోసం విజ్ఞానం, విలువలు, వినోదాల కలబోతగా ఒక మాస పత్రిక; పాఠశాల స్థాయిలో పిల్లలకు వివిధ పోటీల రూపేణా కొత్త తరానికి తెలుగు వెలుగు; సాహిత్య గ్రంథాల ప్రచురణ, తెలుగు వెలుగు.ఇన్



పేరిట వివిధ తెలుగు సంఘాలకు, సంస్థలకు ఉమ్మడి వేదిక త్వరలో సాకారం కానున్నాయి.

ఎప్పటికప్పుడు భాష పరిపుష్టికి దోహద పడేలా ఆంగ్ల పదాలకు సమానార్థక పదాల సేకరణ, సృష్టి నిరంతర క్రతువులా సాగాలి. ఈ యజ్ఞంలో భాషాభిమానులందరూ భాగస్వాములు కావాలి. దాంతో పాటే రామోజీ జ్ఞానాలయం పేరిట ఒక బృహత్ గ్రంథాలయంలో జాతి సాహితీ సంపదను పరిరక్షించి, వాటిలో అవకాశం ఉన్నవాటి ని అంతర్జాలం(నెట్)లో నిక్షిప్తం చేయడం ద్వారా భాషా పరిశోధనల్ని ప్రోత్సహించాలన్నది ఇంకో ఆలోచన. భావి అవసరాలకు దీటైన ఓ మంచి ప్రామాణిక నిఘంటు నిర్మాణం ఈ ఫౌండేషన్ భుజానికెత్తుకున్న మరో గురుతర బాధ్యత.

వాటితోపాటే, భాషాప్రేమికుల్ని సంఘటితం చేసి –ఏ 'ఇజా'లతో నిమిత్తం లేని తెలుగు భాషోద్యమం ద్వారా పాలకులపై ఒత్తిడి పెంచి తెలుగును **'రాజపూజ్యం'** చెయ్యడం, అన్ని స్థాయిల్లో పాలన తెలుగులో సాగేలా, పాఠశాలల్లో ఒక బోధనాంశంగా తెలుగు తప్పనిసరి అయ్యేలా చూడటం – ఈ ఫౌండేషన్ భాషోద్యమ లక్ష్యంగా స్వీకరిస్తోంది.

కార్యాచరణ రూకల్పనలకు ఈ ఫౌండేషన్ త్రికరణశుద్ధిగా నిబద్ధమవుతుంది. మాసపత్రికలు, నిఘంటువులు, కొత్త పదసృష్టి, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే భాషోద్యమం – తదితరాలన్నింటా ముందుండి నడిపించాల్సింది తెలుగువారే.

'తెలుగు సాహితి సంస్కార జలధి
తరతరాల వెలుగురా తెలుగు సంస్కృతి'

అని ఎలుగెత్తి చాటుదాం.

'గతమెంతో ఘనకీర్తి
భవిత సముజ్జ్వల దీప్తి'గా

తెలుగు వెలుగుకోసం ప్రతిన పూనుదాం.

(ఈనాడు 29-08-2012 సౌజన్యంతో)

- విశ్వశాంతి అన్వేషణా కేంద్రం



సామాజిక రుగ్మతలు పరిష్కారం



అభివృద్ధినే పరమావధిగా చేసునున్న నేటి మానవుడు, ఆ అభివృద్ధికే గొడ్డలిపెట్టు అయిన రుగ్మతల వలయంలో రోజురోజుకు కూరుకుపోతున్నాడు. పర్యవసానంగా కుటుంబ వ్యవస్థ, ఆపై యావద్దేశం పైనే చెడుల యొక్క ప్రభావం భారిగా పుడుతున్న కారణంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాలు సైతం భవిష్యత్ విషయమై భయకంపితులౌతున్నాయి. ప్రయోగాలలో వ్యూహ రచనలో క్రొత్త పుంతలు త్రొక్కుతున్న కొద్ధీ మరింత అగాధంలోనికి పోతున్నారే తప్ప సమస్యలకు పరిష్కారం కనుగొన లేక పోతున్నారు. ఇట్టి పరిస్థితులలో ధార్మిక గ్రంథాలైన భగవద్గీత, బైబిలు అంతిమ దైవ గ్రంథమైన దివ్యఖుర్‌ఆన్ నేడు మానవాళి ఎదుర్కొంటున్న సామాజిక రుగ్మతలకు ఏ విధంగా పరిష్కారం చూపుతున్నాయో ఒక్కసారి పరిశీలిద్దాం.

సామాజిక రుగ్మతలు అంటే?

సమాజాన్ని పట్టిపీడించే రుగ్మతలను సామాజిక రుగ్మతలు అంటారు. అవి రెండు రకాలు శారీరకమైనవి మరియు మానసికమైనవి. వ్యభిచారం,త్రాగుడు, జూదం మొదలగునవి శారీరక సంబంధమైనవి. అయితే అనైతికత, అనైక్యత, వరకట్నం, లంచం, స్కాములు, భయాందోళనలు, అభద్రతాభావం, ఈర్ష్యాద్వేషాలు మొదలగునవి మానసికమైనవి చెప్పవచ్చు. మొత్తానికి వ్యక్తి దగ్గర నుండి ప్రారంభమై కుటుంబాన్ని ఆపై పూర్తి సమాజాన్నే నిర్వీర్యం చేసే ఏ చెడు అయినా అది ఏ రూపంలో ఉన్నప్పటికీ సామాజిక రుగ్మతగానే పరిగణింపబడుతుంది.

సామాజిక రుగ్మతల పర్యవసానం...?

ఉదాహరణకు వరకట్నమే తీసుకుందాం. దీని కారణంగా స్త్రీ పుట్టడమే అభిశాపంగా, ఆమె మనుగడయే కుటుంబానికి పెను భారంగా మారుతుంటే మరో వైపు వరకట్నం పొందిన తరువాత కూడా చేదు ఫలితాలైన ఆత్మహత్యలు సజీవదహనాలు మానసిక శారీరక హింసలకు ఎందరో అమాయక స్త్రీలు గురవుతానే ఉన్నారు.

మరొక ఉదాహరణ వ్యభిచారాన్నే తీసుకుందాం. దీని పర్యవసానంగా ఇల్లువళ్లు గుల్లవడమే గాక అనేక భయంకరమైన వ్యాధులకు గురి అవుతున్న కారణంగా సమాజానికి వెన్నుముక లాంటి కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోవడం మన కళ్ళారా చూస్తున్నాం.

ఇంకా అనైక్యతనే తీసుకుందాం. దీని కారణంగా ఎంతో అన్యోన్యంగా జీవించే భార్యభర్తల మధ్య, ఒకే తల్లిదండ్రులకు పుట్టిన సంతానం మధ్య కలహాలు. జాతుల వర్గాల మధ్య ఘర్షణలు. మతాల మధ్య వారధిపోయి వైషమ్యాలు. దేశాల మధ్య నమ్మకాలు లేని కారణంగా ఎంతో విలువైన సమాజ అవసరాలకు ఖర్చు పెట్ట వలసిన ధనాన్ని మారణాయుధాలు, అణుబాంబులు తయారు చేసుకోవటం కోసం ఖర్చు పెట్టుకోవలసి వస్తుంది. ఈ విధంగా ఒక్కొక్క విషయం పరిశీలించుకుంటు పోతే ఒక్కొక్క చెడు – అది ఒక చెడుగా గాక అనేక చెడులకు పునాదిగా, మూలంగా మనకు కనబడుతుంది.

మేధావుల కృషి - దాని ఫలితం...?

ఈ సామాజిక రుగ్మతల గూర్చి విభిన్న కోణాల నుండి పరిశీలించి, పరిశోధించిన మన మేధావులు అనేక అసమానతలు, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి లేని కారణంగా ఈ సమస్యలు ఉద్భవిస్తున్నాయని చెబుతున్నారు. నిజానికి వీరి అభిప్రాయాలు నేటి సమస్యలకు కొంత వరకు కారణాలే అయినప్పటికీ మూల కారణాలను గుర్తించని కారణంగా వారు ప్రస్తావించిన విద్యా, విజ్ఞానం, ఆర్థిక అభివృద్ధి నూటికి నూరు శాతం అభివృద్ధి చెందిన దేశాలలో కూడా ఈ చెడులు (రుగ్మతలు) ఎన్నో విలయతాండమాడుచున్నాయని మనం అనునిత్యం ప్రచార ప్రసార సాధనాల ద్వారా తెలుసుకుంటూనే ఉన్నాము.మరికొందరైతే రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు, బాల గంగాధర్ తిలక్ లాంటి మహానుభావులు ఏదో ఒక రుగ్మత నిర్మూలన కోసం ఉద్యమాల రూపంలో ప్రజలను చైతన్య పరచి చెడుల నిర్మూలనకు ప్రయత్నించినప్పటికీ, అనతి కాలంలోనే ఉద్యమాలు కనుమరుగైపోవటం వ్యక్తులలోని మార్పు కూడా ఒక భ్రాంతిగానే మిగిలిపోవడం జరిగింది. కాబట్టే ఇంకా దైవేతర ఆరాధన. అంటరానితనం, సతీసహగమనం, బాల్య వివాహాలు లాంటి

ఎన్నో రుగ్మతల నివారణ ఉద్యమాకాలాల్లో ఊపందుకున్నా క్రమ క్రమంగా వాటికి సరైన పునాది లేని కారణంగా ఊపిరాడక విల విల లాడాయి. పైగా ఏదో ఒక చెడు దూరమైనా, మానవ జాతిని నిర్వీర్యం చేస్తున్న మరెన్నో చెడులు సమాజంలో కరాళనృత్యం చేస్తూ మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చేశాయి.

ఈ మధ్య కాలంలో మనకళ్ళ ముందే ప్రారంభమైన సారా వ్యతిరేక ఉద్యమం తారాస్థాయికి చేరినా చివరికి మనిషిలో పరి వర్తనకు సంబంధించి సరియైన బలమైన సిద్ధాంతం లేని కారణం గా అనతి కాలంలోనే ఉద్యమం నీరుగారిపోవడమే గాక మద్యం ఏరులైపారు తున్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో అటు ఉద్య మకారులు ఇటు ప్రజలు చేతులుడిగిన వారిలా పడి ఉన్నారు.

ప్రస్తుత సమాజ పరిస్థితి...?

ప్రస్తుత మన సమాజం మేడుపండేకాని మామిడి పండుకాదు. పైకి ఎంతో అందంగా ఉన్నా ఎన్నో సమస్యలతో పూర్తి సమాజం రోగ గ్రస్థంగా మారిపోయింది. ఇది ఏదో ఒక జాతికి, ఒక ప్రాం తానికి సంబంధించిన విషయం కాదు. యావత్తు మానవాళి దేశంలో ఉన్న ప్రతి శాఖ (విభాగం) తనదైన నిజస్థితి కోల్పోయి ప్రమాదపుటంచులపై పయనిస్తోంది.

వ్యక్తి సంస్కరణకు సంబంధించినంత వరకు వాస్తవమైన బలమైన సిద్ధాంతాలులేని కారణంగా మనం తయారు చేసుకున్న చట్టాలు సయితం అదుపు తప్పిన మానవాళిని దిశా నిర్దేశాలతో గాడిలో పెట్టలేకపోతున్నాయి. ఇంకా చట్టాల్లో ఉన్న లొసుగుల కారణంగా మరిన్ని చెడులు రుగ్మతలు ఉనికిలోకి వచ్చి పూర్తి మానవ జాతిని దిక్కుతోచని స్థితిలో పడవేశాయి.

మన ధార్మిక గ్రంథాలు అంటే...?

అనాది కాలం నుండి మానవ శ్రేయస్సు కోసం కరుణామయు డైన దేవుడు, అన్ని ప్రాంతాలకు అనేక భాషలలో ఎంతో మంది ప్రవక్తలను ఎన్నుకోవడమే కాక వారి ద్వారా మానవ మనుగడకు శుభశ్రేయాలకు సంబంధించిన మౌలిక సిద్ధాంతాలను, ఆచరణా సూత్రాలతో పాటు ధర్మాధర్మాల, సత్యాసత్యాల మధ్య వ్యత్యాసం మనిషిలోని దానవుడ్ని నియంత్రించే శాసనాలను సందేశ రూపం లో పంపడం జరిగింది. ఆ పరంపరలో అంతిమ దైవగ్రంథం దివ్యఖుర్‌ఆన్. ఈ గ్రంథం మానవాళి మనుగడకు కావలసిన ఉపదేశాలన్నింటిని తెలియజేస్తుంది.

మన ధార్మిక గ్రంథాల మౌలిక సందేశం?

1. మానవులందరి దేవుడు ఒక్కడే.

"యేకం ఎవద్వితీయం" (చందోగ్య ఉపనిషత్తు 6:2:1)

భావం: ఆయన ఒక్కడు ఆయన తప్ప రెండో వాడు లేడు.

"దావ్యా భూమీ జనయన్‌దేవ ఏక" (శ్వేతాశ్వేతారోపనిషత్ 3:3)

భావం: భూమ్యాకాశాలు సృష్టించినవాడు ఒక్కడే.

"యెహోవానగు నేనే సమస్తమును జరిగించువాడను. నేనొకడనే ఆకాశమును విశాలపరచిన వాడను. నేనే భూమిని పరచినవా డను". (బైబిల్ యెషయా 44:24)

"...ఒక్కడే తండ్రి (దేవుడు) పరలోక మందున్నాడు (బైబిల్ మత్తయి 23:9)

దేవుని పేరుతో నేను మీ అందర్నీ సత్యపథానికి మరలి రమ్మని పిలుస్తున్నాను. ఈ పవిత్ర భావం మీ మనోమస్తిష్కాల్లో ప్రవేశించనీయండి.

"మీ దేవుడు ఒక్కడే ఆ కరుణామయుడు ఆ కృపాశీలుడు తప్ప మరొక దేవుడు లేడు". (ఖుర్‌ఆన్ 2:163)

ఓ ప్రవక్తా! ఇలా ప్రకటించు: "ఆయన అల్లాహ్ అద్వితీయుడు, నిరపేక్షాపరుడు ఎవరి ఆధారమూ ఎవరి అక్కరా లేనివాడు". (ఖుర్‌ఆన్ 112:1,2)

మరణానంతర జీవితం.

దుష్కార్యాలకు పాల్పడేవారిని లోతైన గోతిలోని అంధకారంలో పడవేయండి. అక్కడ నుండి వారు బయటకు రాలేని విధంగా వారిలో ఏ ఒక్కడు ఏ నాటికి తిరిగి బయటకురాడు. (ఋగ్వేదం 7:104:3)

వీరు (అవిశ్వాసులు) నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్య జీవమున కును పోవుదురు. (బైబిల్ మత్తయి 25:46)

పిరికివారును. అవిశ్వాసులను అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికు లందరునూ అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందురు. (బైబిల్ ప్రకటన 21:8)

'అల్లాహ్‌యే మీకు జీవితం ప్రసాదిస్తాడు. తరువాత ఆయనే మీకు మరణం కలుగజేస్తాడు. ఆపైన ఆయనే మిమ్మల్ని ప్రళయంనాడు సమావేశపరుస్తాడు. అది వచ్చే విషయం గురించి ఏ మాత్రం సందేహం లేదు. కాని చాలా మందికి ఈ విషయం తెలియదు'. (ఖుర్‌ఆన్ 45:26)

పై వాక్యాలు పరిశీలించిన తరువాత యావత్ మానవులకు దేవుడు ఒక్కడేననియు ఆయనను హిబ్రూ భాషలో యెహోవా, సంస్కృత భాషలో సర్వేశ్వరుడు, అరబి భాషలో అల్లాహ్ అని పిలిచినప్పటికీ, ఆయన మనిషి చేసే కర్మల గూర్చి ఒకానొక రోజు న ప్రశ్నించడమే గాక ఫలితంగా శిక్షాబహుమానాలు ఇవ్వబోతు న్నాడన్న ధార్మిక గ్రంథాల వాస్తవ బోధనలను మనం అర్థం చేసు కొనుట ద్వారా మాత్రమే మనిషి సంస్కరించబడతాడు. దానవుడై న మానవుడు సాధువై స్వార్థాన్ని వీడి త్యాగామయుడైపోతాడు. తద్వారా సమాజంలో రుగ్మతలు తొలగి స్వర్గమయంగా మారు తుంది. దీనికి చరిత్రే సాక్షమిస్తోంది.

ఒక్కడైన ఆ దేవుడు చూస్తున్నాడు, ప్రశ్నిస్తాడు అన్న భావం ఒక్కటే వ్యక్తి సంస్కరణకు దోహదపడే పూర్తి సమాజంలోని రుగ్మ తలను చెడులను రూపు మాపగల ఏకైక ధార్మిక సిద్ధాంతం అని మనకు తెలుస్తోంది. ఈ సిద్ధాంతాన్నే ప్రచార ప్రసార సాధనాల ద్వారా కుల, మత, వర్గాలకతీతంగా అందరము ప్రచారం చేసి మన దేశాన్ని సమాజిక రుగ్మతల పీడనుండి రక్షించుకుందాము.

సత్యలేఖ

శ్రీ కంచి శంకరాచార్యుల వారికి,
గౌరవనీయులైన శంకరాచార్య స్వామిగల్!
మీకు శాంతి కలుగుగాక.

ఓ సారి మీరు ఆశ్చర్యపడుతూ, హిందూ గ్రంథాలలో ఎక్కడైనా ఇస్లామ్ గురించి, ముహమ్మద్ ప్రవక్త గురించి ప్రస్తావన ఉందా అని నన్ను ప్రశ్నించారు.హిందూ గ్రంథాల నుంచి కొన్ని కొటేషన్లు మీకీ లేఖలో రాస్తున్నాను.

హిందూ గ్రంథాల్లో భవిష్య సూచనలు హిందూ గ్రంథాల్లో దైవప్రవక్త ముహమ్మద్ (స) గురించి అనేక సూచనలు ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సూచనలు పురాణా ల్లో ఉన్నాయి. భవిష్యపురాణంలో ఉన్న సూచన అన్నింటికన్నా స్పష్టంగా ఉంది. ఇందులో దైవప్రవక్త ముహమ్మద్(స) పేరు, దేశం అన్ని వివరాలు ఉన్నాయి–మరుస్థలే నివా సినాం– ఎడారి నివాసి. (అరేబియా). ఈ కారణం వల్లనే ఆర్య సమాజ్ ఈ పురా ణంపై సందేహాలు వ్యక్తం చేసింది. ఈ పురాణంలో ముహమ్మద్ ప్రవక్త(స) ప్రస్తా వన ఉంది. కాబట్టి ఈ పురాణం నమ్మ శక్యమా అన్నది వారి వాదన. అయితే సనాతన పండితులు, అనేకమంది హిందు వులు ఈ పురాణం నమ్మశక్యమైనదిగానే భావిస్తున్నారు.

సంస్కృత శ్లోకం1

ఏతస్ మిన్నన్తరే మ్లేచ్ఛ ఆచార్యేణ సమన్విత
మహామద ఇతిఖ్యాత శిష్య శాఖా సమన్విత
నృపశ్చైవ మహాదేవం మరుస్థల నివాసి నమ్.....

అనువాదం: ఒక మ్లేచ్ఛుడు (అంటే విదేశి యుడు, విదేశీ భాష మాట్లాడువాడు), ఆధ్యాత్మిక గురువు తన శిష్యులతో సహా అవతరిస్తాడు.ఆయన పేరు ముహమ్మద్.

రాజా (భోజుడు) దేవదూతలవలే కని పించే అరబ్బు మహా దేవునికి..... గంగా జల స్నానాన్ని చేయించిన పిదప తన భక్తి ప్రపత్తులను సమర్పిస్తూ గౌరవపూర్వకంగా "నేను మీకు విధేయత చూపుతున్నాను" అన్నాడు. "మానవ జాతికి గర్వ కారణమైన వాడా, అరేబియా నివాసి, రాక్షసులను సంహరించే అపార శక్తి కలిగినవాడవు. మ్లేచ్ఛ శత్రువుల ప్రమాదం నుంచి రక్షణ పొందినవాడు.....నేను నీకు బానిసను. నన్ను మీ చరణాలలో స్వీకరించండి. మహాప్రవక్త ముహమ్మద్ (స) స్తోత్రం ఇది. ఇందులో మహర్షి వ్యాసుడు క్రింది అంశా లను పేర్కొన్నాడు.

1) మహాప్రవక్త పేరు ముహమ్మద్ (మహమద్) అని పేర్కొనబడింది.
2) ఆయన అరేబియా దేశానికి చెందిన వాడని చెప్పబడింది. శ్లోకంలో ఉన్న **"మరుస్థల్"** అన్న సంస్కృత పదానికి అర్థం ఎడారి భూమి అని అర్థం.
3) ప్రవక్త అనుచరుల గురించి ప్రత్యేక ప్రస్తావన ఉంది. మహాప్రవక్త(స) మాదిరి గా ఆయనలానే కనబడే అనేక మంది అనుయాయులు కలిగివున్న ప్రవక్త మరొ కరు ఎవరూ ప్రపంచంలో లేరు.
4) ఆయన పాపరహితుడు, దైవదూతలా కనిపించేవారు.
5) భారతదేశానికి చెందిన రాజు ఆయన పట్ల అపార గౌరవాదరాలు చూపుతాడు.
6) శత్రువుల నుంచి ప్రవక్త(స)కు భద్రత కల్పించడం జరుగుతుంది.
7) ఆయన రాక్షసులను సంహరిస్తాడు. విగ్రహారాధనను నిర్మూలిస్తాడు. అన్ని విధాల చెడులను తొలగిస్తాడు.
8) మహర్షి తనను తాను ఆయన పాదాల వద్ద సమర్పించుకుంటాడు.
9) ఆయన అపార శక్తిశాలి అయినా దైవానికి ప్రతిబింబంలా ఉంటాడు.
10) ఆయ మానవాళికి గర్వకారకుడుగా పరిగణించబడతాడు. (ప్రచాతిస్‌నాథ్)

(భవిష్యపురాణం,పర్వం:3, ఖండం:3, అధ్యాయం:3, శ్లోకం: 5–8)

సంస్కృత శ్లోకం-2

ఇదం జనా ఉపశ్రుత నరాశం సస్తవిష్యతే
షష్టిం సహస్రానవతిం చ కౌరుమ్ ఆ రుశ మేషు దజ్మహే
ఉష్ట్రాయస్య ప్రవాహిణో వధూమన్తో ద్విర్దశ వర్షమా రథస్యని జిహీడతే దిన ఈష మాణా ఉప స్పృశ
ఏష ఇషాయ మా మహే శతం నిష్కాన్ దశ స్రజ
త్రీణి శతాస్య ర్వతాం సహస్రా దశ గోనామ్

అనువాదం: "ప్రజలారా! శ్రద్ధగా వినండి! స్తుతించదగిన మనిషి (ముహమ్మద్) ప్రజ లలో అవతరింపజేయబడతాడు. ప్రవాసిని మేము మా ఆశ్రమంలో తీసుకొంటాము. ఆయన్ని అరవై వేల తొంభైమంది శత్రు వుల నుంచి మా ఆశ్రమంలో తీసుకొం టాము. వారి వాహనాలు ఇరవై ఆడ మగ ఒంటెలు. ఆయన ప్రతిష్ఠ స్వర్గాన్ని అధిగ మిస్తుంది.
ఆయన మహర్షికి వంద బంగారు నాణాలు ఇస్తారు. పది వృత్తాలు ఇస్తాడు. మూడు వందల అరేబియా గుర్రాలు, పది వేల ఆవులు ఇస్తాడు."

(అధర్వణవేదం, కాండం –20, శ్లోకం–127, మంత్రం: 1–3)

పాకిస్తాన్‌కు చెందిన 'భవాని వక్ఫ్' ప్రచు రించిన "ది ఫస్ట్ అండ్ ఫైనల్ రిలిజి యన్"లో ఈ సంస్కృత శ్లోకాలు ఉన్నాయి. భవిష్యపురాణంలో చాలామందికి తెలి యని శ్లోకాలు కొన్ని ఉన్నాయి.

లింగచ్ఛేది శిఖాహీన శ్మశ్రుధారిన దూషక
ఉచ్చలాపీ సర్వభక్షీ భవిష్యతి జనోమమ...
.....ముసలైనైన సంస్కార.....(భవిష్య పురాణం, భాగం–3, శ్లోకం–25–27, సూత్రం –3)



అనువాదం: "వారు 'ఖాత్నా' (సున్నత్) చేయించుకొంటారు. శిరోముండనం చేయిస్తారు. గడ్డాలు ఉంటాయి. మాంసాహారులు. వారు ఆరాధనకు పిలిచే పిలుపు బిగ్గరగా ఉంటుంది. భవిష్యత్తులో వారు 'ముసలై' అని పిలువబడతారు."

రుగ్వేదంలో ముహమ్మద్(స) ప్రస్తావన "మహోమహె"అని వచ్చింది.

(మంత్రం-5 సూక్తం-28)

రుగ్వేదం హిందువుల అతి ప్రాచీన గ్రంథం. కాబట్టి, దైవప్రవక్త హిందూ గ్రంథాల్లో ప్రస్తావించబడిన ప్రవక్త(స). అంతే కాదు, దేవుని ఏకత్వం తర్వాత ప్రస్తావన ఉన్న ఒకే ఒక ప్రవక్త (స) ఆయన.

ఉపనిషత్తుల సందేశం 'పరబ్రహ్మం' అంటే దివ్య ఖుర్‌ఆన్‌లోని అల్లాహ్ తప్ప మరేమీ కాదు. కాబట్టి నేను మిమ్మల్ని ఈ వాస్తవాలు లోతుగా అధ్యయనం చేయమని, దేవుని ఏకత్వాన్ని గ్రహించమని కోరుతున్నాను.

-భవదీయుడు
అబ్దుల్లా అడియార్



ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమయిన ప్రశ్నలు

ప్రశ్న: నీకు ఏ మేలు ప్రాప్తించినా అది అల్లాహ్ తరపు నుంచే, మరి నీకు ఏ కీడు కలిగినా అది నీ స్వయంకృతమే అన్న దైవోపదేశంలోని మర్మం ఏమిటి?

జ: ఈ దైవ వాక్యంలో ప్రస్తావించబడిన 'హసనతిన్'కు దైవానుగ్రహం, కలిమి, మేలు, మంచి అన్న అర్థం వస్తుంది. 'సయ్యి అతన్' అంటే ఆపద, కీడు, లేమి, కష్టం అన్న అర్థం వస్తుంది. నిజానికి ఇవి రెండూ అల్లాహ్ తరపున నిర్ధారించబడినవే 'అనుగ్రహం' మాత్రం అల్లాహ్‌కు ప్రత్యేకించబడింది. ఎందుకంటే అది ఆయన ఉపకారమే. అయితే 'ఆపద' లేక 'లేమి'ని కూడా అల్లాహ్ ఏదేని ఒక పరమార్థం దృష్ట్యా ఉత్పన్నం చేశాడు. కనుక పారమార్థికంగా చూస్తే ఇది కూడా అల్లాహ్ అనుగ్రహభాగ్యమే అనుకోవాలి. ఎందుకంటే అల్లాహ్ ఎవరికీ అపకారం చేయడు. ఆయన చేసే ప్రతిదీ ఉపకారంతో కూడి ఉంటుంది. అందుకే మహనీయ ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: "(ఓ అల్లాహ్!) ప్రతి మేలు నీ చేతుల్లో ఉంది. అయితే కీడు మాత్రం నీకు వర్తించదు." (ముస్లిం)

కనుక చెప్పొచ్చేదేమిటంటే దాసుల పనులన్నీ అల్లాహ్‌చే సృజించబడినవే. కాని దాంతోపాటు దాసులు తమ చేజేతులా చేసుకున్న దాని ప్రతిఫలమే అది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఎవరయితే (దైవ మార్గంలో) ఇచ్చాడో, (తన ప్రభువుకు) భయపడుతూ ఉన్నాడో, ఇంకా సత్పరిణామాన్ని సత్యమని ధృవపరిచాడో, అతనికి మేము సులువైన మార్గపు సౌకర్యం ఒసగుతాము. మరెవరయితే పిసినారిగా తయారై నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించాడో, సత్పరిణామాన్ని త్రోసిపుచ్చాడో, అతనికి మేము కఠిన మార్గపు సామగ్రిని సమకూరుస్తాము." (అల్‌లైల్: 5-10)

ప్రశ్న: "ఫలానా వ్యక్తి వీరమరణం"అని చెప్పటం సమ్మత మేనా?

జ: ఎవరయినా ఒక ప్రత్యేక వ్యక్తి గురించి, అతను అమరగతుడు అని నిర్ధారించటం అంటే అతను ఖచ్చితంగా స్వర్గవాసి అని తీర్పు ఇవ్వటం వంటిదే. మహనీయ ముహమ్మద్(స) ఎవరిని స్వర్గ వాసిగా ప్రకటించారో, మరెవరిని నరకవాసి అని చెప్పారో వారిని గురించి తప్ప వేరితరుల గురించి ఈ మేరకు తేల్చి చెప్పే అనుమతి మనలో ఎవరికీ లేదు. 'వాస్తవస్థితి' రహస్యంగా ఉంచబడింది. ఒకవ్యక్తి మరణించే క్షణాల్లో ఏ పరిస్థితిలో మరణించాడో, అతని సంకల్పం ఎలా ఉందో మనలో ఎవరికీ తెలీదు. మనిషి కర్మలు అతని 'ముగింపు'పై ఆధారపడి ఉన్నాయి. మనిషి మనోగతం గురించి, అతని సంకల్పం గురించి ప్రాప్తిస్తుందని ఆశించవచ్చు.

ప్రశ్న: ప్రత్యేకంగా ఒక ముస్లిం వ్యక్తినుద్దేశించి 'అతను కాఫిర్' అని శాసించటం ధర్మసమ్మతమేనా?

జ: ముస్లిం 'కుఫ్ర్'కి సంబంధించిన ఏదైనా పనిని బాహాటంగా చేయనంతవరకు అతనిపై కుఫ్ర్ ,షిర్క్ నిషాఖ్‌ల తీర్పులు జారీ చేయటం ధర్మసమ్మతం కాదు. ఇక ఆంతర్యాల సంగతంటారా! వాటి గురించి అల్లాహ్‌కే బాగా తెలుసు.

ప్రశ్న: అల్లాహ్ గృహం కాబా తప్ప మరోచోట ప్రదక్షిణ (తవాఫ్) చేయటం సమ్మతమేనా?

జ: కాబతుల్లాహ్ తప్ప భూమండలంలోని మరోస్థలం-అదెంత పవిత్రమైనా సరే - ప్రదక్షిణ (తవాఫ్) చేయటం ధర్మసమ్మతం కాదు. ఎవరయినా ఇతరత్రా పుణ్య క్షేత్రాలను కాబాగృహంతో పోల్చినా లేక భక్తితో ప్రదక్షిణ చేసినా అల్లాహ్‌కు అవిధేయత చూపినట్లే.

స్వర్గధామం



మానవులు సహజంగా కోరుకునే లోకం స్వర్గ లోకం. ఈ ప్రపంచ జీవితం సుఖ దుఃఖాల సమ్మిశ్రమం. కావున మన ఆశలన్నీ ఇక్కడ తీరడం అసాధ్యం. అవి స్వర్గంలో తీరుతాయి. అది మనిషి కొరకు అనుగుణమయినది. అది సజ్జనుల శాశ్వత నివాసం కూడా. స్వర్గలోకం – అది పూర్తిగా తేజోమయమయిన లోకం. అక్కడ ఆనందం, సౌఖ్యాలు, ఉత్తమ అనుభూతులు ఉంటాయి. అక్కడ కోరుకున్న కోరికలన్నీ మొదటి నుండే లభ్యమయి ఉంటాయి. అది మరణరహితమయిన, వెలుగులతో నిండిన, శాశ్వత తేజస్సునిచ్చే, పతన రహితమయిన స్థలం. అక్కడ మన చిరకాల కోర్కెలన్నీ ఈడేరుతాయి. ఆ స్వర్గ లోకంలో కామం, నికామం, సుధ, తృప్తి, ఆనందం, మోదం, ముదావహం, ప్రమోదం ఉంటాయి. అక్కడ వృద్ధాప్య ముగానీ,అలుపుసొలుపులుగానీ, భయ భీతులుగాని ఉండవు. ఈర్ష్యగానీ, క్రోధావేశాలు గాని ఉండవు. అటువంటి పరిశుద్ధ నందన వనాలు పుణ్యాత్ముల విలాస ప్రదేశాలు. అక్కడ అశుద్ధమైన నీచమయిన వస్తువు ఏదీ లేదు. అక్కడ సువాసనతో కూడిన గాలులు – మలయ పవనాలు వీస్తాయి. అక్కడి దైవ స్తోత్రాలు వీనులకు విందుగా, హృదయాలను రంజింపజేసేవిగా ఉంటాయి. అక్కడ శ్రమ గానీ, బాధగాని ఉండదు. ఈ లోకం సత్కర్మల ఫలితంగా లభించే లోకం. అక్కడ ప్రతి మనిషి శరీరం అతని కర్మలకు అనుగుణంగా తేజోమయమయి ఉంటుంది. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"స్వర్గంలో ఒక బజారు ఉంటుంది. స్వర్గ వాసులు ప్రతి శుక్రవారం అక్కడికి వెళ్తారు. అక్కడ (ఒక విధమయిన) ఉత్తర పవనాలు వీస్తాయి. అవి స్వర్గవాసుల ముఖాలపై, దుస్తులపై సువాసనను వెదజల్లుతాయి. దాంతో వారి అందం ద్విగుణీకృతం అయిపోతుంది. అలా వారు ఎంతో అందంగా మారి తమ తమ నివాసాలకు తిరిగి వెళ్తారు. వాళ్ల భార్యలు వారిని చూసి 'దైవసాక్షి! మీరు మా నుండి వేరయినప్పటికంటే ఇప్పుడు మీ అందం రెట్టింపయింది' అనంటారు. వారి మాట విని 'అల్లాహ్ సాక్షి! మేము మీ దగ్గర నుంచి వెళ్ళిన తర్వాత మీ అందం కూడా రెట్టింపయింది' అనంటారు". (ముస్లిం)

ఈ సుఖసంతోషాలని అనుభవిస్తూ ఉండగా అల్లాహ్ వైపు నుండి పిలుపు వస్తుంది. 'మీకు ఇంకేమయినా కావాలా? అడగండి, ఇస్తాను' అనంటాడు.

దానికి వారు: 'ప్రభూ! నువ్వు మా ముఖాలను తేజోవంతం చేయలేదా? మమ్మల్ని నరకం నుండి కాపాడి స్వర్గంలో ప్రవేశింపజేయలేదా? అని సవినయంగా విన్న వించుకుంటారు'. (ముస్లిం)

అల్లాహ్ స్వర్గవాసుల్ని సంబోధిస్తూ – స్వర్గ వాసులారా! అని పిలుస్తాడు. దానికి వారు 'మేము నీ సన్నిధిలో హాజరయి ఉన్నాము. ప్రభూ! మీ ప్రతీ ఆదేశాన్ని శిరసా వహించ డానికి మేము సదా సిద్ధంగా ఉన్నాం, సెలవి య్యండి'. అనంటారు. అప్పుడు అల్లాహ్ "మీరు నా పట్ల సంతుష్టులయ్యారా?" అని అడుగుతాడు. 'ప్రభూ! నువ్వు మాకు నీ దాసులకెవ్వరికీ ప్రసాదించని మహాభాగ్యాలు ప్రసాదించావు. అలాంటప్పుడు మేము ఎందుకు సంతుష్టులము కాము?' అంటారు స్వర్గవాసులు. అప్పుడు అల్లాహ్– 'సరే, ఇప్పుడు నేను మీకు ఇంతకంటే శ్రేష్ఠమయిన మహా భాగ్యం ప్రసాదించనా?" అంటాడు. 'ఇంత కంటే శ్రేష్ఠమయిన మహా భాగ్యం ఇంకేముంటుంది' అంటారు స్వర్గవాసులు. "వినండి. బాగా వినండి. నేను మీకు శాశ్వతంగా నా ప్రసన్నతా భాగ్యం ప్రసాదిస్తున్నాను. ఇక ఎప్పుడూ నేను మిమ్మల్ని ఆగ్రహించను".

(బుఖారీ, ముస్లిం)

అయితే ఓ మా ప్రభూ! నీ దర్శనాభాగ్యాన్ని మాకు అనుగ్రహించు. అది తప్ప మాకు ఇంకే మీ వద్దు. అదే మా ఆశలకి ఆఖరి హద్దు' అని వేడుకుంటారు.

ఆ తర్వాత అల్లాహ్ దివ్య దర్శనం కోసం తెర ఎత్తివేయబడుతుంది. అప్పుడు పరాత్పరుడయిన అల్లాహ్ స్వర్గవాసుల ముందు ప్రత్యక్షమవుతాడు. అపూర్వమయిన ఈ దివ్య దర్శనంతో స్వర్గవాసుల అణువణువూ పులకిస్తుంది).ఒకే ఒక్క చూపు! ఏం జరుగుతుంది?

స్వర్గాన్ని ఒక చూపు చూసినప్పుడు ప్రాపంచిక భోగభాగ్యాలను, దుఃఖవిషాదాలను మరచిపోయినా ఆ దైవ దాసులే, అల్లాహ్ దివ్య దర్శనం చేసుకుంటున్నంత సేపూ స్వర్గపు మరే మహా భాగ్యం వైపు దృష్టి సారించరు. వారు సృష్టికర్త సౌదర్యానికి ముగ్ధులయి తన్మయం చెందుతూ ఉంటారు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం–'ఒకే ఒక్క దర్శనంలో కొన్ని వేల సంవత్సరాలు గడచిపోతాయి; కానీ ఆ ధ్యాసే దాసులకు ఉండదు'–అటువంటి మహా మహి మాన్వితమయినది అల్లాహ్ దివ్య దర్శనం. సుబ్హానల్లాహ్!

అల్లాహ్ ఈ దివ్య దర్శనం కేవలం ఒక్కసారి మాత్రమే లభిస్తుందా? తిరిగి మళ్ళీ మళ్ళీ దర్శించుకుని తాదాత్మ్యం చెందే భాగ్యం స్వర్గవాసులకు లభించదా?


హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) ఈ విధంగా సెలవిచ్చారు: "స్వర్గంలో హోదాల రీత్యా అధమశ్రేణి స్వర్గవాసికి లభించే సామ్రాజ్యంలోని తోటలు, ఆసనాలు, భార్యలు, సేవకులు, ఇతర మహా భాగ్యాలు రెండు వేల సంవత్సరాల ప్రయాణమంతా పరిధిలో విస్తరించి ఉంటాయి. పోతే అత్యున్నత శ్రేణికి చెందిన స్వర్గవాసికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అల్లాహ్ దివ్య దర్శన మహా భాగ్యం లభిస్తుంది". ఆ తర్వాత దైవప్రవక్త (స) వారు ఖుర్ఆన్‌లోని ఈ (75:22) సూక్తి పఠించారు: **"ఆ రోజు కొందరి ముఖాలు కళ కళ లాడుతూ దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారు తమ ప్రభువుని ప్రత్యక్షంగా చూస్తుంటారు".** (తిర్మిజీ)

చివరిగా స్వర్గవాసులకు అల్లాహ్ ఆశీర్వాదం (సలాం)తోపాటు వారు స్వర్గంలో కలకాలం ఉంటారన్న శుభవార్త కూడా విన్పించ బడుతోంది.

మిత్రమా! నీకు కలగబోయే ఈ మహా భాగ్యం గురించి ఎప్పుడయినా ఆలోచించావా! ఏ మార్గాన్ని అవలంబించాలో నీ అంతరాత్మను అడుగు. ఓ బృందం స్వర్గవనాలలో విహరిస్తుంది.మరో బృందం నరకాగ్నికి ఆహుతి అవుతుంది. నీ ప్రభువు సత్య మార్గాన్ని స్పష్టం చేసేశాడు. అపమార్గాన్ని విడమరచి చెప్పేశాడు. ఇక నువ్వు కృతజ్ఞుడవై జీవించవచ్చు లేదా కృతఘ్నుడవై బ్రతకవచ్చు.

"విశ్వసించిన ప్రజలారా! మీ ప్రభువు క్షమా భిక్ష వైపునకు, భూమ్యాకాశాలంతటి విశాలమయిన స్వర్గధామం వైపునకు పోయే మార్గంలో పోటీ పడండి". (అల్ హదీద్: 21)

- విశ్వశాంతి అన్వేషణా కేంద్రం



ఇస్లాం అంటే ఏమిటి?

'ఇస్లాం' అన్న పదం అరబీ భాషలోని 'సల్మున్' (శాంతి), 'సిల్మున్'(విధేయత) అన్న పదాల నుండి ఉద్భవించింది. ఆధ్యాత్మికంగా చూస్తే 'మనల్ని మనం దైవానికి సమర్పించు కోవటం ద్వారా ఇహపరాల్లో శాంతి సాధించడం'. 'ముహమ్మదీయ ధర్మం, ముహమ్మదనిజం, ముహమ్మదీయులు'అనడం పొరపాటు. ఎందుకంటే ఈ పదాలు దైవాన్ని కాక, ముహమ్మద్ (స)ని ఆరాధిస్తారన్న అపోహ కల్గిస్తాయి. అరబీ భాషలో 'అల్లాహ్' అంటే 'సర్వోన్నతుడైన దైవం' అని అర్థం. ముస్లిములే కాక అరబ్బు క్రిష్టియన్లు కూడా దేవుణ్ణి 'అల్లాహ్' అనే పిలుస్తారు. ఇస్లాం కొత్త మతమేమి కాదు. దైవం అనాదిగా తన ప్రవక్తల ద్వారా మానవాళికి అందజేస్తూ వచ్చిన ధర్మమే ఇస్లాం. ప్రపంచ జనాభాలో ఐదవ వంతు ప్రజలైన ముస్లిములకు ఇస్లాం ఓ ధర్మం మాత్రమే కాదు జీవన విధానం కూడా. శాంతి, కరుణ, క్షమాగుణం బోధించే ధర్మాన్ని ముస్లిములు ఆచరిస్తున్నారు.

ముస్లిములంటే ఎవరు?

'ముస్లిం' అంటే 'ఇస్లాం అనుసరిస్తున్న వ్యక్తి' లేదా తనను దైవానికి అర్పించుకున్న వ్యక్తి' అని అర్థం. ప్రపంచ వ్యాప్తంగా-దేశము, ఖండము, తెగ, జాతి, సంస్కృతీ అన్న తేడా లేకుండా నూట డెబ్భయి కోట్ల మంది ముస్లిములున్నారు. ప్రపంచ ముస్లిం జనాభాలో కేవలం 18% మంది మాత్రమే అరబ్ దేశాల్లో జీవిస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక ముస్లిం జనాభాకల దేశం ఇండోనేషియా. ఆసియా, ఆఫ్రికాల్లో కూడా ముస్లిములు చెప్పుకోదగ్గ సంఖ్యలో నివసిస్తున్నారు. సోవియట్ యూనియన్, చైనా, ఉత్తర అమెరికా, దక్షణ అమెరికా,యూరొప్‌లలో ముస్లిములు అల్ప సంఖ్యాకులు.

ముస్లిములు ఏమి నమ్ముతారు?

ముస్లిములు ఈ విశ్వ సృష్టికర్త, పోషకుడు, ఏకైక దైవం అల్లాహ్‌ను నమ్ముతారు. దైవం తాను సృష్టించిన దూతల ద్వారా, ప్రవక్తల ద్వారా మానవాళికి అందించిన ధర్మ గ్రంథాలను నమ్ముతారు. తీర్పుదినాన ప్రతి వ్యక్తి తన కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందన్న విషయాన్ని నమ్ముతారు. ఇహంలోనూ, మరణానంతరం కూడా మనిషి జీవితంపై పూర్తి అధికారం దైవానికి ఉందని నమ్ముతారు. ఆదం (అ) మొదలుకొని- నూహ్, ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాకూబ్ , యూసుఫ్, అయ్యూబ్, మూసా, హారూన్, దావూద్, సులైమాన్, ఇల్యాస్, యూనుస్, యహ్యా, ఈసా అలైహిముస్సలామ్-మొదలైన ప్రవక్తలందరినీ నమ్ముతారు. దైవం తన అంతిమ సందేశాన్ని, అంతకు ముందు ప్రకటించిన సందేశాల సారాన్ని దైవదూత జిబ్రీల్ (అ) ద్వారా చివరి ప్రవక్త ముహమ్మద్(స)కు అందజేశారు.

ఎవరైనె ముస్లిం కావొచ్చు?

"అల్లాహ్ తప్ప ఆరాధనీయులు ఎవరూ లేరు. ముహమ్మద్(స) అల్లాహ్ అంతిమ ప్రవక్త" అని విశ్వాస ప్రకటన చేసిన వారంతా ముస్లిములు అవుతారు. ఈ ప్రకటన ద్వారా దైవ ప్రవక్తలు, వారు తెచ్చిన ధర్మ గ్రంథాలను తాను నమ్ముతానని విశ్వాసి చాటుకుంటాడు.

కాబా అంటే ఏమిటి?

కాబా అనేది ప్రార్థనా స్థలం. దైవం 4000 ఏళ్ళకు పూర్వం అక్కడ దైవారాధన నిమిత్తం ఒక గృహం నిర్మించమని ఇబ్రాహీమ్(అ)కు, ఇస్మాయీల్(అ) ఆదేశించాడు. ఆ కట్టడాన్ని రాతితో నిర్మించారు. చాలామంది ఆదం(అ) స్థాపించిన ప్రార్థనాలయంపై ఈ కట్టడం నిర్మించబడిందని భావిస్తారు. ఆ ప్రదేశానికి దైవారాధన కోసం రమ్మని మానవాళిని పిలవాల్సిందిగా ఇబ్రాహీమ్(అ)ను అల్లాహ్ ఆదేశించాడు.

ఇప్పటికీ పవిత్ర హజ్ యాత్రికులు అక్కడికి వెళ్ళినప్పుడు నాటి ఇబ్రాహీమ్ పిలుపుకు ప్రతిస్పందనగా 'ఓ ప్రభువా, మేము నీ సేవలో హాజరయ్యాము' అని నినదిస్తుంటారు.

ముహమ్మద్ (స) ఎవరు?

క్రీ.శ. 570 సంవత్సరంలో ముహమ్మద్ (స) మక్కా నగరంలో జన్మించారు. అప్పటికి ఇంకా ఐరోపా ఖండంలో క్రైస్తవ ధర్మం వ్యాపించ లేదు. ముహమ్మద్ (స) లోకంలోకి అడుగు పెట్టక ముందే తండ్రి అబ్దుల్లాహ్ గతించారు. అనతికాలంలోనే ఆయన తల్లి ఆమినా కూడా చనిపోయారు. తర్వాత ఆయనను తాతయ్య అబ్దుల్ ముత్తలిబ్, వారి అనంతరం బాబాయి అబూ తాలిబ్ పెంచి పెద్ద జేశారు. ఆయన పెరిగి పెద్దయ్యాక సత్యసంధతకు, విశ్వసనీయతకు మారుపేరయ్యారు. అందుకనే వివాదాలు పరిష్కరించి తీర్పు చెప్పాల్సిందిగా ప్రజలు ఆయనను కోరేవారు. ఆయన ప్రశాంతచిత్తుడనీ, ఆధ్యాత్మిక చింతన చేసేవారని చరిత్రకారులు అభివర్ణిస్తారు.

ముహమ్మద్ (స) ఎంతో ఆధ్యాత్మిక చింతన గల వ్యక్తిగా ఎదిగారు. ఆయనకు సమాజంలోని చెడుల పట్ల ఏహ్యభావం ఉండేది. మక్కా సమీపంలోగల 'జబలె నూర్' (కాంతి శిఖరం) దగ్గరలో ఉన్న 'హిరా' గుహలో తరచూ ఆధ్యాత్మిక చింతనలో ఉండేవారు.

ఆయన ఎలా ప్రవక్త అయ్యారు?

తన 40వ ఏట దైవదూత జిబ్రీల్ (అ) కనిపించి దైవగ్రంథం ఖుర్‌ఆన్‌లోని వాక్యాలు ముహమ్మద్ ప్రవక్తకు వినిపించారు. ఈ విధంగా అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని మానవాళికి బోధించే నిమిత్తం ముహమ్మద్ ప్రవక్త(స)కు 23 సంవత్సరాలలో జిబ్రీల్ ద్వారా అందజేశాడు.

జిబ్రీల్ (అ) నుంచి విన్న వాక్యాలని ఆయన తు.చ. తప్పకుండా పునరుచ్ఛరించేవారు. దైవం తెలిపిన సత్యాన్ని గురించి ప్రజలకు బోధించేవారు. దీని కారణంగా సత్య విరోధులు ఆయన శిష్యులను వేధించటం, పీడించటం మొదలు పెట్టారు. క్రీ.శ. 622వ సంవత్సరంలో అల్లాహ్ ముహమ్మద్ (స) ప్రవక్తనూ, ఆయన శిష్యులనూ వలస వెళ్ళమని ఆదేశించాడు.

(మిగతాది 12వ పేజీలో)

– షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ

హజ్ ఇస్లాం యొక్క కీలక భాగాలలో ఒక భాగం. దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "ఇస్లాం ధర్మం ఐదు విషయాలపై ఆధారపడి ఉంది. 1) అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్(స) అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యం పలకటం. 2)నమాజు స్థాపించటం. 3) జకాత్ చెల్లించటం. 4) హజ్ చేయటం. 5) రమజాన్ నెలలో ఉపవాసం పాటించటం. (బుఖారీ,ముస్లిం)

స్థోమత కలిగి ఉండే ప్రతి స్త్రీపురుషునిపై జీవితంలో కనీసం ఒకసారి హజ్ చేయడం విధి. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఓ ప్రజలారా! అల్లాహ్ మీపై హజ్‌ని విధిగా చేశాడు కావున మీరు హజ్ చేయండి.

హజ్ విధి(ఫర్జ్)అవటానికి షరతులు:

1) **ఇస్లాం:** అనగా హజ్ ముస్లింపై విధి అవుతుంది, అవిశ్వాసులపై కాదు.

2) **అఖల్:** మతిస్థిమితి కోల్పోయినవారిపై హజ్ విధి కాదు.

3) **బులూగ్:** యుక్తవయసుకు చేరినవారు.

చిన్నపిల్లలు కూడా హజ్ చేయవచ్చు, వారిని హజ్ చేయించే పెద్దలకు దాని పుణ్యం లభిస్తుంది. ఆ విధంగా బాల్యంలో హజ్ చేసిన పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత ఆర్థిక స్థోమత కలిగిన వారయితే వారు తిరిగి హజ్ చేయవలసి ఉంటుంది. బాల్యంలో హజ్ చేసినంత మాత్రాన ఆ బాధ్యత నెరవేరినట్లు కాదు.

4) **స్వతంత్రుడయి ఉండాలి:** బానిసపై హజ్ విధి కాదు. ఒకవేళ బానిస హజ్ చేసినా స్వతంత్రుడైన తర్వాత స్థోమత కలిగినవాడైతే తిరిగి హజ్ చేయవలెను.



5) **స్థోమత:** అంటే ప్రయాణ ఖర్చులు, వస్తు సామగ్రిని సమకూర్చుకోగలిగితే అని అర్థం. దీంతో పాటు హజ్ యాత్రకై పరిస్థితులు సానుకూలంగా ఉండాలి. వెళ్ళే రూటులో శాంతియుత పరిస్థితులు నెలకొని ఉండాలి. అలాగే యాత్రికుడు అంతదూరం ప్రయాణం చేయగలిగేందుకు ఆరోగ్యవంతంగా ఉండాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి ఆ గృహ (యాత్ర) హజ్ చేయటాన్ని అల్లాహ్ విధిగా చేశాడు."**

(ఆలి ఇమ్రాన్:97)

ఒకవేళ ఎవరయినా ఆర్థికంగా స్థోమత కలిగి ఉండి, శారీరకంగా ప్రయాణం చేయ లేనివాడైతే అతను వేరే (హజ్‌చేసిన) వాడిని అతని తరపునుంచి పంపించవలెను. అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) కథనం: ఒక స్త్రీ దైవప్రవక్త దగ్గరకి వచ్చి దైవప్రవక్తా! అల్లాహ్ తన దాసులపై విధిగా చేసిన హజ్ మా నాన్న గారికి అనివార్యమయినప్పటికీ ఆయన ముసలి వారయిపోయారు. వాహనం మీద సరిగా కూర్చోలేని పరిస్థితిలో ఉన్నారు. మరి ఆయన తరపున నేను హజ్ చేయవచ్చునా? అని అడిగింది. అందుకా యన(స) "చేయ వచ్చు" అని సమాధానమిచ్చారు. (బుఖారీ,ముస్లిం)

6) స్త్రీలకు పైన పేర్కొన బడిన షరతులతో పాటు వారి వెంట మహ్రమ్ కూడా ఉండాలి. ఒకవేళ మహ్రమ్ లేనట్లయితే ఆమెపై హజ్ విధి కాదు.

పై షరతులు కలిగి ఉండేవారు వెంటనే హజ్ చేసుకొనవలెను. వచ్చే సంవత్సరం చేద్దామని వాయిదా వేయకూడదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "హజ్ చేయాలని నిశ్చయించు కున్న వ్యక్తి హజ్ చేయడానికి త్వర పడాలి. ఎందుకంటే అతనికి జబ్బు చేయవచ్చు, ఏదో వస్తువు తప్పిపోవచ్చు లేదా ఇతర కారణాల వల్ల హజ్ చేయడం సాధ్యపడకపోవచ్చు. (ఇబ్నెమాజహ్)

ఉమర్ (ర) ఇలా అనేవారు: ఎవరయితే హజ్ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఉండి కూడా హజ్ చేయరో వారిపై "జిజ్‌యా" విధించాలని నాకు అనిపిస్తుంది. నిశ్చయంగా వారు విశ్వాసులు కారు. (అల్ ముస్తఖా)

హజ్ ఔన్నత్యం:

1.హజ్ మబ్రూర్ యొక్క ప్రతిఫలం స్వర్గం

అబూహురైరా(ర)కథనం: దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: **"మబ్రూర్ (ఆమోద ముద్ర పడిన) హజ్‌కు ప్రతిఫలం స్వర్గం తప్ప మరేమీ లేదు".** (బుఖారీ,ముస్లిం)

2. హజ్ వలన పాపాలు క్షమించబడతాయి.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (ర) కథనం: దైవప్రవక్త(స) ఇలా అన్నారు: హజ్ మరియు ఉమ్రా చేస్తూ ఉండండి. ఎందుకంటే బట్టి ఏ విధంగా చిలుమును తుదముట్టిస్తుందో అదే విధంగా హజ్ మరియు ఉమ్రా పేదరికాన్ని మరియు పాపాల్ని తుదముట్టిస్తాయి.

(తబ్రాని)

3. ఈమాన్ మరియు జిహాద్ తర్వాత అన్నిటి కంటే ఉత్తమమైనది హజ్:

అబూహురైరా(ర)కథనం: దైవప్రవక్త(స)ను "ఆచరణలన్నిటిలోకెల్లా శ్రేష్ఠమైనది ఏది?" అని ప్రశ్నించడం జరిగింది. అందుకాయన (స) సమాధానమిస్తూ "అల్లాహ్‌ను ఆయన ప్రవక్తను విశ్వసించటం" అని అన్నారు. "ఆ తర్వాత ఏది"? అని అడిగితే "అల్లాహ్ మార్గంలో పోరాడటం" అని చెప్పారు. "ఆ తర్వాత ఏది"? అని అడిగితే 'హజ్జె మబ్రూర్' అని చెప్పారు.

4. హజ్ అన్నిటికంటే శ్రేష్ఠమైన పోరాటం:

ఆయిషా(ర)కథనం: నేనొకసారి దైవ ప్రవక్త(స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మేము దైవమార్గంలో పోరాడటాన్ని శ్రేష్ఠ మైన ఆచరణగా భావిస్తాం. అందుకని మాకూ దైవమార్గంలో పోరాడాలని ఉంది" అని అన్నారు. అందుకాయన(స) (మీకొరకు) శ్రేష్ఠ మైన పోరాటం 'హజ్జె మబ్రూర్' చేయటానికి ప్రయత్నించటం. అని చెప్పారు. (బుఖారీ)

5. ముసలివారు, దుర్బలమైనవారు, స్త్రీలు వారి జిహాద్, హజ్ మరియు ఉమ్రా:

అబూహురైరా(ర)కథనం: దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ముసలివారి కొరకు, దుర్బ లమైనవారి కొరకు మరియు స్త్రీల కొరకు హజ్ మరియు ఉమ్రా చేయటమే వారి పోరాటం". (నసాయి)

6.హజ్ ఉమ్రాలు చేసేవారు అల్లాహ్ అతి థులు, వారి దుఆ స్వీకరించబడుతుంది:

దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "హజ్ ఉమ్రాకు వెళ్ళేవారు అల్లాహ్ ముఖ్య అతి థులు, వారు అల్లాహ్‌ని వేడుకుంటే అల్లాహ్ ఆ వేడుకోలు స్వీకరిస్తాడు. క్షమాభిక్షను అర్థిస్తే క్షమిస్తాడు." (తబ్రాని)

7. హజ్‌యాత్రలో మరణిస్తే నేరుగా స్వర్గంలో ప్రవేశిస్తారు:

అబూ హురైరా(ర)కథనం: దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఎవరయితే హజ్ కోసం బయలుదేరి మరణించాడో ప్రళయదినం వరకూ అల్లాహ్ అతన్ని హజ్ చేసే పుణ్యాన్ని ప్రసాదిస్తాడు. మరెవరయితే ఉమ్రా కోసం బయలుదేరి మరణించాడో అల్లాహ్ అతన్ని ప్రళయం వరకూ ఉమ్రా చేసే పుణ్యాన్ని ప్రసా దిస్తాడు". (అబూయాలా)

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) కథనం: ఒక వ్యక్తి అరఫా మైదానంలో దైవప్రవక్త(స)తో పాటు విడిది చేశాడు. అతన్ని ఒంటె క్రింద పడవేసింది, మెడ విరిగి మరణించాడు. అతని గురించి దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"అతన్ని రేగాకులతో స్నానం చేయించండి, రెండు (ఇహ్రామ్) దుస్తులలోనే కఫన్ (వస్త్ర ధారణ) చేయించండి, తలను కప్పకండి, సువాసన పూయకండి, ఎందుకంటే ప్రళయ దినాన అతను లేపబడేటప్పుడు 'తల్బియా' పఠిస్తూ ఉంటాడు." (బుఖారీ, ముస్లిం)

8. హజ్ విశిష్ఠతలో ఒక హదీస్:

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) కథనం: దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు: "ఎప్పుడైతే మీరు హజ్ కోసం బయలుదేరుతారో మీ సవారీ యొక్క ప్రతి అడుగుకీ ఒక పుణ్యం వ్రాయ బడుతుంది. ఒక పాపం క్షమించ బడుతుంది. అరఫాలో విడిది చేసినప్పుడు అల్లాహ్ తొలి ఆకాశంపై దిగి వచ్చి దైవ దూతల ఎదుట గర్వంతో ఇలా అంటాడు: చూడండి వీరు నా దాసులు, దూర ప్రయాణం నుంచి చిందర వందర స్థితిలో దుమ్ము ధూళితో నా దగ్గరకు వచ్చారు. నా కారుణ్యాన్ని ఆశిస్తున్నారు. నా శిక్ష నుంచి భయపడుతున్నారు. (కాని నన్ను వారు చూడలేదు) ఒకవేళ నన్ను వారు చూస్తే వారి పరిస్థితి ఏమిటి! ఒకవేళ వారిపైన ఇసుక కంకర్ల సమానం, లేదా ప్రపంచం యొక్క రోజుల సమానం లేదా వర్షం యొక్క చిను కుల సమానం పాపాలున్నా అల్లాహ్ వాటిని కడిగి వేసేస్తాడు. జమరాత్‌కు కంకరాళ్ళు కొట్టేటప్పుడు దాని ప్రతిఫలం అల్లాహ్ వారి కొరకు సామగ్రి చేస్తాడు. తల వెంట్రుకలు తీసేటప్పుడు ప్రతి వెంట్రుకకు బదులు ఒక పుణ్యం ప్రసాదిస్తాడు. మరియు తవాఫ్ చేసే టప్పుడు వారు పాపాల నుంచి ఏ విధంగా పవిత్రం అయిపోతారంటే తల్లి గర్భంలో నుంచి ఎటువంటి పాపం లేకుండా పుట్టిన వానిలా పవిత్రులైపోతారు". (తబ్రానీ)

హజ్ ఆదేశాలు:

1. హజ్‌కు వెళ్ళాలని సంకల్పించుకున్న వారు హజ్ ఉమ్రాలు చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమని సంకల్పించు కోవాలి. ఎందుకంటే ఆచరణలు స్వీకార యోగ్యం అయేందుకు ఇఖ్లాస్, చిత్తశుద్ధి షరతు. అల్లాహ్ ఇలా సెలవిచ్చా డు: "వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, ఏకాగ్రచిత్తులై -నమాజును నెలకొల్పాలనీ, జకాత్‌ను ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి ఆదేశించబ డింది. ఇదే స్థిరమైన, సవ్యమైన ధర్మం."

(అల్‌బయ్యినహ్: 5)

2. ధర్మసమ్మతమైన సంపాదనతోనే హజ్‌కు వెళ్ళాలి:

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: 'ఓ ప్రజ లారా! అల్లాహ్ పరిశుద్ధుడు, పరిశుద్ధతనే స్వీకరిస్తాడు." తర్వాత ఆయన (స) ఒక వ్యక్తి గురించి వివరించారు: అతను దూర ప్రయాణం చేసి, చిందర వందర, దుమ్ము ధూళితో ఆకాశంవైపు చేతులెత్తి, ఓ నా ప్రభూ! ఓ నా ప్రభూ! అని ప్రార్థిస్తు న్నాడు. అతను తినేది, త్రాగేది, ధరించినవి అతని పోషన సంపాదన అన్నీ హరాంతో కూడి నవే. అటువంటప్పుడు ప్రార్థన ఎలా స్వీక రించబడుతుంది? (ముస్లిం)

3. ఖుర్‌ఆన్ సహీహ్ హదీసుల ప్రకారమే హజ్ ఆదేశాలు నేర్చుకొనవలెను. వారు వీరు చెప్పారని, చేస్తున్నారని చేయకూడదు. దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "హజ్ విష యాలు నాతో నేర్చుకోండి. ఈ హజ్ తరు వాత బహుశా నేను హజ్ చేయలేనేమో!"

(ముస్లిం)

4. తౌబా (పశ్చాత్తాపం) చేసుకొని, అప్పు లుంటే ఇచ్చేసి, ఇంటివారిని అల్లాహ్ పట్ల భయభక్తులతో ఉండాలని, ఎవరి హక్కుల యినా మిగిలిపోయి ఉంటే తీర్చేయాలని హితోపదేశం చేయవలెను.

5. ఇహ్రాం సంకల్పం తర్వాత ముఖ్యంగా తన నాలుకను బేకార్ మాటల నుండి కాపాడు కొనవలెను. ఒకరిని హాని కల్గించ కూడదు. మొత్తం సమయాన్ని అల్లాహ్ విధే యతలో గడపవలెను. అల్లాహ్ ఇలా సెలవి చ్చాడు: "హజ్ మాసాలు నిర్ధారితమై ఉన్నాయి. కనుక ఈ నిర్ణీత మాసాలలో హజ్‌ను తన కొరకు విధించుకున్న వ్యక్తి-హజ్ దినాలలో-కామక్రీడలకు, పాప కార్యాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలి.

(మిగతాది: 14 వ పేజీలో)



(9వ పేజీ మిగతా భాగం)

ఇస్లాం, ముస్లిం గురించి అవగాహన

దీనినే 'హిజ్రత్' (వలస) అంటారు. మక్కా నగరం నుంచి ఉత్తరాన 260 మైళ్ళ దూరంలో ఉన్న మదీనాకు వారు హిజ్రత్ చేశారు. ఇక్కడ నుండే ముస్లిముల 'హిజ్రీ శకం' (ఇస్లామీయ క్యాలెండర్) మొదలయ్యింది.

వలస వెళ్ళినప్పటి నుండి ఇస్లాం స్వీకరించేవారి సంఖ్య అతి వేగంగా పెరగసాగింది. అనతి కాలంలోనే చుట్టు ప్రక్కల వందలాది పట్టణాల్లో అత్యధిక ప్రజలు ముస్లిములయ్యారు. మక్కాలోని సత్యవిరోధులు చేసిన అన్ని దాడులు, యుద్ధాలు, కుతంత్రాలను అధిగమించి ఇస్లాం ప్రబల శక్తిగా మారింది. తరువాత ప్రవక్త(స), ఆయన అనుచరులు మక్కా నగరాన్ని హస్తగతం చేసుకొన్నారు. ఓటమిపాలైన తమ పాత శత్రువులను వారు నిండు మనస్సుతో క్షమించి అక్కడ ఇస్లాం ధర్మాన్ని స్థిరపరిచారు. ప్రవక్త ముహమ్మద్(స) తన 63వ ఏట చనిపోయారు. అప్పటికే అరేబియాలోని అత్యధిక ప్రాంతంలో ఇస్లాం వ్యాపించింది. ప్రవక్త(స) చనిపోయిన శతాబ్దిలోనే ఇస్లాం ధర్మం స్పెయిన్, పశ్చిమ చైనా, తూర్పున దూరతీరాలకు వ్యాపించింది.

ప్రపంచంపై ఇస్లాం శాశ్వత ప్రభావం

ఇస్లాం వేగవంతంగా వ్యాపించడానికి గల ప్రధాన కారణం ధర్మ సిద్ధాంతాలు సరళంగా ఉండటమే. దేవుడు ఒక్కడేననీ, అతడినే ఆరాధించమని ఇస్లాం ధర్మం ప్రబోధిస్తుంది. మనిషి తన మేధస్సును, ఆలోచనాశక్తిని ఉపయోగించాలని పదే పదే ప్రోత్సహిస్తుంది.

"జ్ఞానాన్ని సముపార్జించడం ప్రతి ముస్లిం (స్త్రీ పురుషుల) విధి" అని ప్రవక్త ముహమ్మద్(స) అన్నారు. ఇస్లాం వ్యాపించిన చోట్లలో కొన్ని సంవత్సరాల్లోనే గొప్ప నాగరికతలు, విశ్వవిద్యాలయాలు వెలిశాయి. ప్రాక్ పశ్చిమ ఆలోచనల సమ్మేళనం, పాత కొత్త ధోరణుల మేలు కలయిక కారణంగా, ముస్లిం దేశాలలో వైద్య, గణిత,భౌతిక,ఖగోళ వాస్తు కళలు, సాహిత్యం, చారిత్రక రంగాలలో ఎంతో ప్రగతి వచ్చింది. అల్‌జిబ్రా వంటి కఠిన గణిత పద్ధతులు, అరబీ అంకెలు, 'సున్నా' విలువ వంటివి ముస్లింల ద్వారానే మధ్య యూరోప్‌కు వ్యాపించాయి. యూరోప్ సాహస యాత్రికులు ఆధునిక పరికరాలు రూపొందించడానికి మార్గం సుగమమయింది. అలాంటి అత్యాధునిక పరికరాల్లో ఆస్ట్రోలాబ్, క్వాడ్రంట్, నావి కాపటం వంటివి కూడా ఉన్నాయి.



c. narayana reddy

తెలుగువాడు

శాతవాహనుల వంశాన పుట్టినవాడు
కాకతీయుల పోతుగడ్డ మెట్టినవాడు
పల్లెలోనే కాదు ఢిల్లీలో సైతమ్ము
పెద్ద గద్దెలనేలి పేరుకెక్కినవాడు
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

పంచె కట్టులలో ప్రపంచాన మొనగాడు
కండువా లేనిదే గడప దాటనివాడు
పంచ భక్ష్యాలు తన కంచాన పడ్డించ
గోంగూర కోసమై గుటకలేసేవాడు
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

తల్లి బాసకు వేరు ఇల్లు కావలెనంచు
రైళ్ళు పడగొట్టి మారాము చేసెను నాడు,
ఏకభాషకు రెండు ఇళ్లు కావలెనంచు
అఖిల భారతమునే అదర గొట్టెను నేడు
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

తెలుగు బాసను జుంటితేనెయని తెగపొగిడి
పొరుగింటి పులుసుపై మరులు పెంచినవాడు,
దేశభాషలలోన తెలుగు లెస్సని చాటి
మల్లెలకు బదులు లిల్లీలు వలచినవాడు
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

ఒకచేత మజ్జిగను ఒడిసి పట్టినవాడు
ఒకచేత మధుపాత్ర వొదిలిపెట్టినవాడు
ఒక ముహూర్తాన ఇంచుక బుర్రగోకుకొని
చల్ల (మజ్జిగ) వంచినచేత కల్లు వంచినవాడు
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

నేల నల్దెసల ధేరాలు నాటినవాడు
అన్ని మూసలలోన అట్టె ఒదిగినవాడు
"ఏ దేశ మేగినా ఎందు కాలిడినా"
ఆవకాయ వియోగ మసలె సైపనివాడు
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

మంచి మనసెదురైన మాలలిచ్చేవాడు
భాయి భాయీ అన్న చేయి కలిపేవాడు
తిక్కరేగిందంటే దొక్కచీల్చేవాడు
చిక్కు లెరుగనివాడు చిత్తాన పసివాడు.
ఎవడయ్య ఎవడువాడు, ఇం
కెవడయ్య తెలుగువాడు.

ఎక్కడికి పోవాలి మనం?

-శాంతి ప్రియ

ఎక్కడికి పోతున్నాడు మానవుడు?
ఎక్కువలసిన ఫిర్‌దౌస్ స్వర్గశిఖరాలపైకా
దిక్కుమాలిన పాపాల నరక కూపాల్లోకా
ఎక్కడికి పోతున్నాడు?
ఏ సుడిగుండాల్లో చిక్కుకుపోతున్నాడు?

సత్య యుగం నుంచి మిథ్యా లోకంలోకి
దూకి, మిథ్యాలోకంలోంచి రాకెట్ యుగానికి
ఎగబ్రాకి మళ్ళీ వెనక్కి నడుస్తున్నామా
మనుషుల్ని మనుషులే తిన్న
అమానుష బర్బరయుగంలోకి
అసభ్యతా విష ప్రభంజనం
ఆకులు రాల్చిన జజ్జర యుగంలోకి.

ధనానికున్న విలువ ధర్మానికి లేకుండా పోతోంది
మృగాలకున్న విలువ మానవులకు లేకుండా పోతోంది
బంగారానికున్న విలువ బాంధవ్యానికి లేకుండా పోతోంది
ఇహానికున్న విలువ పరానికి లేకుండా పోతోంది
వేయి తలలతో అక్రమార్జనం విజృంభించి పోతోంది
పడగలు విప్పిన దౌర్జన్యం పైపైకొస్తోంది.

అణ్వస్త్రాలతోపాటు అంతరాలు అంతమవ్వాలి
గ్రహాలతోపాటు ఆగ్రహాలను గెలవాలి
చెట్టాపట్టాలు పట్టుకున్న సౌజన్యం
పట్టాలపై పయనించాలి
ప్రతి అధరంపై దరహాసం చిందాలి.
ప్రతి బీడులో మమతల మల్లెలు పూయాలి.

ఇన్ని మరకలా? ఈ అద్దానికి ఇకనయినా తుడిచి పెట్టు
ఇన్ని రుచులా? ఈ దేహానికి ఇకనయినా వదలి పెట్టు
పోగుల్లాగా తెగిపోతున్న హృదయాల్ని ముడిపెట్టు
పరిస్థితి విషమించక ముందే చేయందించి నిలబెట్టు
తీవెల్లే ఒదిగే పచ్చని భావాలకు శ్రుతి కట్టు
దమన నీతి సాగించే మానవ సైతానుల భరతం పట్టు
మానవ జాతి విముక్తికి నెత్తుట తడిసిన సత్యకేతనానికి జైకొట్టు
సహనాన్ని మడిచి పెట్టే సవాలంటూ తొడగొట్టు.

ఎక్కడికి పోవాలి మనం?
పాపాలను ప్రకాళించే ప్రార్థనాలయంలోకి
శాతాను పదలగొట్టే శరణాలయంలోకి
ప్రవక్తలు నడచిన సత్యమార్గంలోకి
ప్రభువు కూర్చిన స్వర్గ ధామంలోకి



ఐహిక వ్యామోహపరులు

పాము-తేలు ఒక రంధ్రంలో కలిసి ఉండొచ్చేమోగానీ ఐహిక వ్యామోహపరులైన పండితులు ఎన్నటికీ ఒకటి కాలేరు. శునకాల సేన సాధారణంగా మౌనంగానే ఉంటుంది, కానీ ఇటు ఖసాబ్ ఎముక విసరడమే ఆలస్యం అటు దాని పంజా, దంతాలు విషపూరితమవుతాయి. ఇదే ఉపమానం ఈ ఐహిక వ్యామోహ పరులది. ఎక్కడ ఇహం అనే స్వార్థం, ఎముక రూపంలో కనబడు తుందో అక్కడికి చేరి తమ అవయవాలపై పట్టు కోల్పోతారు.

కలతల్ని రూపుమాపి, చీలికల్ని అంతమొందించి పోగుల్లా తెగిపోతున్న మానవ బ్రతుకుల్ని ముడిపెట్టి రుజుమార్గన నడిపించే విద్యకే తలమానికమయిన సత్యశోధన వారి ఆయశం కాదు. వినా శకాలే విపరీత బుద్ధి అన్నట్టు వారు నేర్చుకున్న విద్య మొత్తం విద్వేష బీజాలు నాటడానికే. విద్వంశాలు సృష్టించి, మత ఘర్షణలు రగిలించి మారహోమానికి ఆజ్యం పోసి మానవత్వాన్ని మట్టిపాలు చేయడానికే.

మనో తుచ్ఛ వాంఛల దాస్యం వారి దమనీతికి ప్రేరణగా ఉంటుంది. ఐహిక లాలస వారి దౌష్ట్యాన్ని మరింత పెంచుతుంది. దుర్మార్గులు, దుష్టులు కూడా ఒక్కోసారి కలసి పండగ జరుపు కోవడం చూస్తాము. దొంగలు, దోపిడీదారులు కూడా కొన్ని సంద ర్భాల్లో కలిసి దోచుకోవడం కనబడుతుంది. కానీ, ఈ వర్గం దైవా రాధనల, భక్తిప్రపత్తుల పవిత్ర ప్రాగణం నడిమధ్యలో కొలువు దీరి కూడా ఏకం కాదు.

నిరతం ఒండొకరి తన, మాన, ధనాలతో చెలగాటమాడటం తోనే వీరి ఉదరాలు ఉబికి, కడుపుల మంటలు చల్లారుతాయి. మదుశాలల్లో ప్రేమ గీతాలు, ఆప్యాతానురాగంతో కూడిన మాటలు వినబడతాయి. కానీ ప్రార్థనాలయ వినిర్మిల మెహ్రాబ్ క్రింది సారథ్య బాధ్యతల కోసం వారిలోని ప్రతి హస్తం ఇంకొక్కరి కుత్తుకలు రాల్చడానికి, విద్వేష నిప్పులు చెరిగే ప్రతి నేత్రం తోటి సోదరుని రక్తం కళ్ళ చూడడానికి ఉరకలేస్తోంది.

ప్రవక్త ఈసా (అ) యూద పండితుల్ని ఉద్దేశించి- **'మీరు దావూద్ గృహాన్ని దొంగల క్రేందంగా మార్చేశారు'** అని అన్నారు. ఆ కేంద్రాల విషయమయితే తెలియదుగానీ, మేము మాత్రం ప్రార్థ నాలయాల పవిత్ర ప్రాంగణాలలో తోడెళు గుంపులను సొంత సోదరుల మృత కళేబరాల్ని కరకర నమలడం చూశాము.

- మౌలానా అబుల్ కలామ్ ఆజాద్


ధార్మిక గ్రంథాల వెలుగులో దేవుడు

ప్రియమైన ధార్మిక సోదరు లారా!

మీరెప్పుడైనా ఈ విషయమై ఆలోచించారా? మన చుట్టూ వ్యాపించి ఉన్న ఈ అనంతమైన విశ్వవ్యవస్థ దానంతట అదే ఉనికిలోకి వచ్చిందా? లేక మరెవరి ద్వారానైనా ఉనికిలోకి తీసుకు రాబడిందా? ఈ విశ్వములో ఉన్న విభిన్న శక్తులు ఒకే దేవుని ఆధీనంలో ఉన్నాయా? లేక అనేక దైవాల ఆధీనంలో ఉన్నాయా?



ఇదే విధంగా మానవుని జయాపజయాలు, లాభనష్టాలు, వ్యాధి స్వస్థత, సమస్తము స్వయంగా మానవుని అధీనంలో ఉన్నాయా? విభిన్న శక్తుల ఆధీనంలో ఉన్నాయా? లేక దైవాధీనంలో ఉన్నాయా?



ఈ ప్రశ్నలకు సరియైన స్పష్టమైన సంపూర్ణమైన సమాధానాలు లభించినంత కాలం మానవులు అజ్ఞానాంధకారపు కారుచీకట్లలో కొట్టు మిట్టాడుతూ, మూఢ నమ్మకాలు, మిథ్యామార్గాలలో తచ్చాడుతూ తమ శక్తి సామర్థ్యాలను ధారపోస్తూ ఉంటారు.

సమాజంలో కొందరు తెలివైన వాళ్ళు (మోసగాళ్ళు, వంచకులు) తాముకూడా అతీంద్రియ శక్తులు కలిగియున్నామని ఏదైనా చేయగల మని భ్రమపరుస్తున్న కారణంగా, ప్రజలు మోసాలకు గురై తమ సంపదలను నష్టపరు చుకోవడమే గాక ఒక్కోక్క సారి పరువును కూడా పోగొట్టుకోవలసి వస్తుంది.

ఇటువంటి సమయంలో మన ధార్మికగ్రంథాలు మనకిచ్చే సమాధానమేమిటి? పరిశీలించవలసిన అవసరం లేదా? అసలు దేవుని గూర్చి మన ధార్మిక గ్రంథాలు ఇచ్చే సందేశం ఏమిటో మొదటగా పరిశీలించి తెలుసుకుందాము.

విభిన్న దైవాలా? ఏకైక దైవమా?

★ య ఏక ఇత్తము ష్తుతి
(ఋగ్వేదం 6:45:16)

ఒక్కడు, సాటిసమానము లేని ఆయన్నే స్తుతించండి.

★ ఏకోహి రుద్రోన ద్వితీయాయ తస్థు ఒక్కడే దేవుడు రెండవవాడు లేడు (శ్వేతాశ్వేతరో పనిషత్తు 3:2) ★ మామేకం శరణం వ్రజ నన్నొక్కనిమాత్రమే శరణు బొందుము (గీత 18:66)

★ నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు, నేను తప్ప ఏ దేవుడును లేడు. (బైబిల్ యెసయా 45:5)


★ మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. (బైబిల్ మార్కు 12:29)


★ మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి.(బైబిల్ 1 కొరింథీ 8:6)

★ ఒకవేళ ఆకాశంలో భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్ళు కూడా ఉంటే, అప్పుడు (భూమ్యాకాశాల) రెండింటి వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది. (ఖుర్ఆన్ 21:22)
– మరొక దేవుడెవ్వడూ ఆయనతో పాటు లేడు. ఒకవేళ అలా అయితే, ప్రతి దేవుడు తన సృష్టిని తీసుకొని వేరుపడిపోయేవాడు. (ఖుర్ఆన్ 23:91)

★ ఆయన అల్లాహ్,అద్వితీయుడు, అల్లాహ్ నిరపేక్షాపరుడు. (ఖుర్ఆన్ 112:1-2)

గమనిక: పై వాక్యములు పరిశీలించినచో వేదాలు, ఉపనిషత్తులు, గీత, బైబిలు, ఖుర్ఆన్ ప్రకారం మనల్ని, యావత్తు సృష్టిని సృజించి పోషించి–పాలించే స్వామి– యజమాని అయిన దేవుడు ఒక్కడేనని విభిన్న దైవాలు లేనే లేరని స్పష్టమవుతోంది.





దేవుడు పుడతాడా?

★ యో మామజమనాదిం చవేత్తి లోకమహేశ్వరమ్ అసమ్మూఢస్స మర్త్యేషు సర్వపాపై ప్రముచ్యతే.
ఎవడు నన్ను యదార్థముగా జన్మరహితునిగను, అనాదియైన వానిని గాను సకల లోక మహేశ్వరునిగాను తెలిసుకొనుచున్నాడో వాడు మానవులలో జ్ఞాని, అట్టి వాడు సర్వ పాపముల నుండి విముక్తుడగును.
(గీత 10:3)

★దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు. పశ్చాత్తాపపడుటకు ఆయన నరపుత్రుడు కాదు.(బైబిల్ సంఖ్యా కాండము 23:19)

★ ఆయనకు సంతానం ఎవరూ లేరు ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. (ఖుర్‌ఆన్ 112:3)

గమనిక: పై వాక్యముల ప్రకారం దేవునికి పుట్టుక అనేదే లేదని పుట్టినది, సృష్టించబడినది ఏది దేవుడు కాదని గుర్తించిన మానవుడు మాత్రమే జ్ఞాని అని తెలుస్తుంది.

దేవుడు చనిపోతాడా?

★ పరస్తస్మాత్తు భావోన్యో వ్యక్తో వ్యక్తాత్స నాత న:య: స సర్వేషు భూతేషు నశ్యత్సు వినశ్యతి

ఆ అవ్యక్తము కంటేను పరమైన విలక్షణమైన సనాతనమైన అవ్యక్త భావమే ఆ పరమ పదము. ప్రాణులన్నీయు నశించినను ఆ పరమ పురుషుడు మాత్రము నశింపడు. (గీత 8:20)

★చిరంజీవియు, సర్వోన్నతుడునగు దేవుని స్తోత్రం చేసి ఘనపరచి స్తుతించితిని. (బైబిల్ దానియేలు 4:34)

★భూదిగంతములను సృజించిన యెహోవా నిత్యుడగు దేవుడు.(బైబిల్ యెషయా 40:28)

★ ఒక్క ఆయన ఉనికితప్ప ప్రతీది నశించేదే. (ఖుర్‌ఆన్ 28:88)

★ఆయన సజీవుడు, నిత్యుడు, అసంతుడు. (ఖుర్‌ఆన్ 2:255)

గమనిక: ఈ సృష్టి సకల జగత్తు నశించిపోయినను ఆ ఒక్క దేవుడు నశింపక నిరంతరం సజీవంగా ఉంటాడనేది సుస్పష్టం.

దేవుడు కనిపిస్తాడా?

★ ససందృశే తిష్ఠతి రూపమస్య నచక్షుషా పశ్యతి కశ్చనైనమ్

ఆయన రూపం దృష్టి పరిధిలో నిలువదు. కన్నులతో ఆయనను చూడలేము. (శ్వేతా శ్వేతరోపనిషత్తు 40:20)

★ ఆయన మనకు అగోచరుడు. (బైబిల్ యోబు 37:23)

★చూపులు ఆయనను అందుకోలేవు ఆయన చూపులను అందుకుంటాడు. (ఖుర్‌ఆన్ 6:103)

గమనిక: పై వాక్యముల ద్వారా దేవుడు అవ్యక్తస్వరూపుడు కాబట్టి మన కన్నులకు అగోచరుడు అని తెలపడమే గాక ఎవరైతే కనిపించే ప్రతిదాన్ని దైవమని భ్రమిస్తారో వారు అవివేకులని కూడా చెప్పడం జరిగింది.

దేవుడు అవతరిస్తాడా?

★ అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయ పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్

నాశరహితమైనట్టియు, సర్వోత్తమైనట్టియు ప్రకృతికి పరమైవిలసిల్లునట్టియు నా స్వరూపమును తెలియని అవివేకులు అవ్యక్తరూపుడగు నన్ను పాంచ భౌతిక దేహమును పొందిన వానినిగా తలంచుచున్నారు. (గీత 7:24)

★ మరియు భూమి మీద ఎవనికైనను తండ్రి (దేవుడు) అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీ తండ్రి (దేవుడు) ఆయన పరలోక మందున్నాడు. (బైబిల్ మత్తయి 23:9)

★దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి ఆజ్ఞను తీసుకొని అవతరిస్తారు. (ఖుర్‌ఆన్ 97:4)

గమనిక: దేవుని తరుపున దూతలు అవతరిస్తారే గాని, దేవుడు అవతరించడు. ఎవరైతే దేవుడే అవతరిస్తాడని తలంచుచున్నారో, వారు ఆయా వాక్యాభాగాలు అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నారని అర్థమౌతుంది.

ఎందుకంటే గీతా శాస్త్రము సయితం సర్వశక్తివంతుడైన దేవుడు పాంచభౌతిక దేహం దాల్చడని స్పష్టంగా తెలియజేస్తుంది.

దైవేతరులను ఆరాధిస్తే కలిగే పర్యవసానం?

★ అంధం తమ ప్రవిశంతియే అసంభూతిముపాసతే తతో భూయ ఇవతే తమోయ ఉ సంభూత్యాగ్ రతా

ఎవరైతే ప్రకృతిని ఉపాశిస్తారో వారు అంధకారం (నరకం)లో ప్రవేశిస్తారు. ఎవరు సంభూతిని (మానవునిచే తయారుచేయబడిని వాటిని) ఆరాధిస్తారో వారు మరింత అంధకారం (నరకం)లో ప్రవేశిస్తారు. (యజుర్వేదం 40:9)

★ యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు నరులను ఆశ్రయించి శరీరులను తనకాధారముగా చేసికొనుచు తన హృదయమును యెహోవా మీద నుండి తొలగించుకొనువాడు శాపగ్రస్తుడు. (బైబిల్ యిర్మియా 17:5)

★ ఇతరులకు అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు. (ఖుర్‌ఆన్ 5:71)

గమనిక: మొత్తం పరిశీలన ద్వారా అర్థమైన విషయమేమిటంటే వేదోపనిషత్తులు, గీత, బైబిలు మరియు అంతిమ దైవగ్రంథమైన దివ్య ఖుర్‌ఆన్ ద్వారా ఒక్కడైయున్న ఆ దేవుడు హిబ్రూలో యెహోవాగా, సంస్కృతంలో సర్వేశ్వరునిగా మరియు అరబీ భాషలో అల్లాహ్‌గా పిలువబడిన ఆయన చావు పుట్టుకలు లేని వాడని అదృశ్యుడైన ఆయన అవతరించడు అని అర్థమవుతుంది. ఇంకా సర్వేశ్వరుడు యెహోవా అయిన ఆ అల్లాహ్ ని తప్ప ఇతరులకు ఆరాధిస్తే దాని పర్యవసానంగా ఇహలోకంలో శాపాలకు గురి అవడమే గాక, మరణానంతరం నరకంలో బాధాకరమైన ఘోర శిక్షలు చవిచూడవలసి వస్తుందని మన ధార్మిక గ్రంథాలు మనలను హెచ్చరిస్తున్నాయి. కాబట్టి నిజ దైవమయిన అల్లాహ్‌ను ఆరాధించి, ఆయన ఆదేశాలను గైగొని స్వర్గానికి వెళతామో, బహుదైవాలను మొక్కి అవిధేయత చూపి నరకం పాలవుతామో మనమే నిర్ణయించుకోవాలి.

(10వ పేజీ తరువాయి భాగం)

మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు. (హజ్‌యాత్రకు బయలుదేరినప్పుడు) ప్రయాణ సామగ్రి (ఖర్చు)ని వెంట తీసుకెళ్ళండి. అయితే అన్నింటికంటే అత్యుత్తమ సామగ్రి దైవభీతి. కనుక ఓ బుద్ధిమంతులారా! నాకు భయపడుతూ ఉండండి". (అల్‌బఖర:197)

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "ఎవడైతే ఎలాంటి అపసవ్యమైన చేష్టలకు, వ్యర్థవిషయాలకు పాల్పడకుండా, దైవ అవిధేయతకు ఒడిగట్టకుండా జాగ్రత్త పడుతూ హజ్ చేస్తాడో అతను ఆరోజే తల్లి గర్భం నుంచి పుట్టినవానిలా (పరమ పవిత్రుడై) తిరిగి వస్తాడు. (బుఖారి, ముస్లిం)

6.తవాఫ్, సయీ చేసేటప్పుడు, రాళ్ళు రువ్వేటప్పుడు తమ తరపు నుంచి వేరే వారికి హాని, నష్టం బాధ కలగించకూడదు. దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు:"తన నాలుక మరియు చేత్తో వేరే ముస్లిములను హాని కల్పించని వాడు నిజమైన ముస్లిం". (బుఖారి,ముస్లిం)

7. జమాఅత్‌తో నమాజ్ చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపించకూడదు.

8. స్త్రీలు, గైర్ మహ్రమ్‌లు ఎదురైతే పరదా పాటించవలెను. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"ఓ ప్రవక్తా! తమపై నుంచి తమ దుప్పట్లను (క్రిందికి) వ్రేలాడేలా కప్పుకోమని నీ భార్యలకు, నీ కుమార్తెలకు, విశ్వాసులైన స్త్రీలకు చెప్పు. తద్వారా వారు చాలా తొందరగా (మర్యాదస్తులుగా) గుర్తించబడి, వేధింపుకు గురికాకుండా ఉంటారు. అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు."** (అల్ అహ్‌జాబ్:59)

ఐపిసి ఆధ్వర్యంలో ఈదుల్ ఫిత్ర్ పండుగ సంబరాలు





ఐపిసి ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు







ఐపిసి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ సంబరాలు





ఐపిసి ఆధ్వర్యంలో ఖుర్ఆన్ పోటీలు

TMA ఆధ్వర్యంలో రమజాను స్వాగతం





TMA ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు











IMA ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు రాషన్ పంపిణి



నరక కూపం

తల్లిదండ్రి, సోదరి, సోదరులు, భార్యాపిల్లలు, బంధువులు, స్నేహితులు ....ఇలా మనిషి జీవితంలో బాంధవ్య బంధాలు అనేకం. అందులో కొన్ని తియ్యగా ప్రారంభమయి మధురాతిమధురంగా మారితే,ఇంకొన్ని మధురంగా మొదలయి పరమ చేదుగా పరిణమిస్తాయి. మనలో కొందరు తమవారిని ఉన్నత స్థితికి తీసుకువచ్చేందుకు, తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించేందుకు, తమ ఆడ సంతానాన్ని గొప్పంటి సంబంధాలు చూసి పెళ్ళి చేసేందుకు కష్టాలన్నీ తాము అనుభవించి సుఖాలు మాత్రం కుటుంబ సభ్యులు అందేలా అహిర్నిశలు పరిశ్రమిస్తుంటారు. అటువంటి త్యాగధనుల్ని మరచి బ్రతికే కాలం నేటిది. తనయుడి ప్రేమ కై తపించే తల్లిదండ్రులు,అయిన వారు ఉండి కూడా ఆదర కరువైన అనాథలు, భర్త అనురాగం పొందలేని భార్యలు, భార్య ప్రేమ లభించని భర్తలు...ఇలా చెప్పుకుంటూపోతే మానవ సంబంధాలన్నీ సమస్యాత్మకంగానే ఉంటున్నాయి. ఇహంలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే, ఎటువంటి సంపద, సంతానం లాభించని రోజున వారి ప్రవర్తన ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"(గూబగుయ్యిమనిపించే) గావుకేక (అంటే ప్రళయం) వచ్చినప్పుడు.. ఆ రోజు మనిషి తన (స్వంత) సోదరుని నుండి పారిపోతాడు.తన తల్లి నుండి, తండ్రి నుండి, తన భార్య నుండి, తన పిల్లల నుండి (పారిపోతాడు). ఆ రోజు ప్రతి ఒక్కరికీ తన సంగతి చూసుకోవటంతోనే సరిపోతుంది". (అబస: 33-37)

ఇక కళ్ళ ఎదుట కనబడే కన్నవారినే పట్టించుకొని మనుషులు ఎక్కడో, ఎప్పుడో ఎదురుకాబోయే నరక పరిణామాల గురించి పట్టించుకుంటా రనుకోవడటం అత్యాశే అవుతుంది. ఈ అహంతోనే ఉన్నావా? అసలు ఉన్నావా? అని దైవాన్ని, ఆయన ఉనికినీ గద్దించి అడిగేవాళ్లు కొందరయితే, అసలు దైవం లేదు పొమ్మనేవాళ్ళు మరికొందరు మనకు తారస పడతారు. ఇటువంటి ఏమరుపాటుకు గురై జీవించే వారి మార్గదర్శకత్వం, మేల్కొల్పడం కోసమే ప్రవక్తలు వచ్చారు. వారు నిజ దైవం ఎవరో విస్పష్ట పర్చడమే కాక, దాసుల హక్కులేమిటో, దేవుని హక్కు లేమిటో విడ మరచి చెప్పడంతోపాటు స్వర్గనరకాలు సత్యమన్న విషయాన్ని నొక్కి వక్కాణించారు. **'ప్రజలారా! నరకాగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ఖర్జూరపు ఒక ముక్కను దానం చేసైనా సరే'** అని ఎంతో ప్రేమగా పిలుపు ఇచ్చారు. అయితే చేసిన, చూసిన ఉపకారాల్నే విస్మరించిన మనిషి ఈ యదార్థాన్ని త్రోసి పుచ్చాడు. దైవాన్నీ నమ్మలేదు, నరకాన్ని స్వర్గాన్నీ విశ్వసించలేదు. అసలు మరణానంతరం జీవితం ఉంటుందన్న విషయాన్నే తిరస్కరించాడు. తను సాధించి ప్రగతి ఫలాలను చూసుకొని మురిపోతూ మిడిసిపాటుకి గురై విర్ర వీగాడు. తాను వీధి గుండా నడివెళితే భూమి చీలిపోతుందని, ఆకాశం బ్రద్దలవుతుందని, తాను పర్వతాలంతటి ఎత్తుకు చేరుకుంటాని తన సత్తాను తానే మత్తెక్కి కళ్ళు పైకెక్కి కన్ను మిన్ను కానక ప్రవర్తించాడు. ఇట్టి స్వభావం గలవారు ఎవరయినా సరే వారు ఆలోచించాల్సింది ఒక్కటే; దైవప్రవక్తలు, ధర్మకర్తలు చెప్పింది వారు అనుకున్నట్టు అసత్యమయితే ఆపాపర వారికే తగులుతుంది. వారికెలాంటి నష్టంవాటిల్లదు. కానీ...ఒకవేళ వారు చెప్పింది అక్షర సత్యమయితే? **'చూడండి! మీరు ఇంత కలాం తిరస్కరిస్తూ వచ్చిన నరకాగ్ని ఇదే'** అని నరక దూత వారితో అన్నప్పుడు, అప్పుడు వారి సమాధానమేమిటి? అప్పుడు వారు ఎక్కడికి పారిపోగలరు? ఎక్కడ తల దాచుకోగలరు? ఏ ఆపద్బాంధవుడిని ఆశ్రయించగలరు?

నరకాగ్ని ఎంత వేడిగా ఉంటుందనే విషయాన్ని దైవప్రవక్త (స) ఇలా వివరించారు: "నరకాగ్ని ఇహలోకాగ్నికంటే 70 రెట్లు అధిక వేడి కలిగి ఉంటుంది". అంటే ఒకవేళ ప్రపంచ ఉష్ణోగ్రత 2000 డిగ్రీల సెంటిగ్రేట్ అయితే నరకాగ్ని వేడి 138 వేల డిగ్రీల సెంటిగ్రేడ్‌గా ఉంటుంది. ఈ భయంకరమయిన వేడితోనే నరకవాసుల దుస్తులు తయారు చేయబడతాయి. ఈ అగ్నితోనే వారి పడకలు కూడా తయారు చేయబడతాయి. ఈ అగ్నితోనే వారి గొడుగులు, స్తంభాలు కూడా తయారు చేయబడతాయి. ఈ అగ్నితోనే వారి కొరకు గచ్చు పరచబడు తుంది. ఇటువంటి మహా కఠినమయిన శిక్షాస్థలంలో మానవ జీవితం ఎలా కొనసాగుతుంది? తన చేతిలో ఒక చిన్న నిప్పు రవ్వను భరించలేని మానవుడు అంతటి భయంకర నరకాగ్నిని ఎలా భరిస్తాడు? తీర్పు దినాన ఈ నరకాగ్ని జ్వాలల్ని చూసి మానవాగ్రేసరులయిన ప్రవక్తలే భయంతో వణుకుతూ అల్లాహ్‌ను 'రబ్బి నల్లిమ్ నల్లిమ్' అని ప్రార్థిస్తుంటే సాధారణ వ్యక్తుల పరిస్థితి, అందులోనూ పాపాత్ముల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి.

స్వర్గపు శుభవార్తను పొందిన 10 మంది భాగ్యవంతుల్లో ఒకరయిన హజ్రత్ ఉమర్ (ర) ఖుర్‌ఆన్ పారాయణ సమయంలో నరక ప్రస్తావన ఉన్న వాక్యం పఠించి స్పృహ కోల్పోయారు.**"తండ్రిగారూ! రాత్రి పూట ప్రపంచమంతా ప్రశాంతంగా నిద్రపోతున్నది. మరి మీరెందుకు మేల్కొనే ఉన్నారు?"** అని హజ్రత్ రబీ (ర) గారిని ఆయన కుమార్తె ప్రశ్నించగా - **"అమ్మాయి! నరకాగ్ని నీ తండ్రిని పడుకోనివ్వటం లేదమ్మా"** అని సమాధానమిచ్చారాయన. **"నిజానికి నీ ప్రభువు శిక్ష ఎంతో భయపడ వలసినటువంటిది".** (దివ్యఖుర్‌ఆన్ -17: 57)

అనాథాశ్రమాల పేరుతో ఆస్తుల్ని పెంచుకునేవారలారా! భూకబ్జాల పేరుతో శ్రామికుల నిలువు దోపిడికి పాల్పడేవారలారా! జాతి సంపదను కొల్లగొట్టేవారలారా! వడ్డీ, చక్ర వడ్డీ, బారు వడ్డీలంటూ పేదల నడ్డీ విరగొట్టేవారలారా! మద్య పానానికి, మగువ లోలత్వానికి బానసయి బ్రతికేవారలారా! ఒక్కసారి కాదు, వందసార్లు ఆలోచించండి!

పోతే వారు ఏం భుజిస్తారు? "వారు తమ ఉదరాలను నరకాగ్నితో నింపుకుంటారు". ఈ వచనాన్ని వ్యాఖ్యానిస్తూ పండితులు ఏమన్నారంటే నరకవాసుల ఆకలి తీవ్రత ఎలా ఉంటుందంటే - దాని ముందు నరక శిక్షలు కూడా స్వల్పమనిపిస్తాయి. నరకావాసులకు ఆకలేస్తుంది. తమ ఆకలి తీర్చవలసిందిగా వారు అల్లాహ్‌ను వేడుకుంటారు. అల్లాహ్ వారికి ఆహారాన్ని అందజేస్తాడు. కానీ ఆ ఆహారం ఎలా ఉంటుందనుకుంటున్నారు? **"నిశ్చయంగా జఖ్ఖూమ్ (జెముడు) వృక్షం. పాపాత్ములకు ఆహారం అవుతుంది".** (దుఖాన్: 43,44)

ఓ పాషాణ హృదయుడా! కాళనాగులా స్వల్ప లాభం కోసం స్త్రీల తన, మాన, ధనాలను కాజేసిన కుయుక్తుడా! జిత్తులమారి నక్కలా ఎన్నో కాపురాల్లో కలతలు రేపి, ఎన్నో కొంపల్ని కూల్చిన ఓ క్రూరుడా! శాంతి స్థాపన చాటున ఆరాచకాన్ని సృష్టించిన ఓ దానవుడా! ఈ జఖ్ఖూమ్ వృక్షం అంటే ఏమిటో నీకు తెలుసా? ఈ వృక్షపు ఒకే ఒక్క బొట్టు గనక ప్రపంచంలో పడితే వారి జీవితంలో రుచి అన్న మాటనే వారు మరచి పోతారు. పరమ చేదుగా ఉంటుంది దాని ఒక్క బొట్టు. చూడు ఆ సర్వేశ్వరుడు ఏమంటున్నాడో! **"అది నూనే గసిలాగా ఉంటుంది. అది కడుపులోకి పోయి సలసల కాగే నీరు మాదిరిగా ఉడుకుతూ ఉంటుంది".** (దుఖాన్: 45, 46)

మనిషి ఈ బాధను భరించలేక కాళ్ళూచేతులు గిలగిల కొట్టుకుంటూ నరకానికి ఓ ప్రక్క చేరుతాడు. తక్షణమే అల్లాహ్ ఆజ్ఞ అవుతుంది: **"వాడ్ని పట్టుకోండి. ఈడ్చుకుమటూ పోయి నరకాగ్ని నడిబొడ్డున పడ వేయండి".** (దుఖాన్: 47) తర్వాత ఏమవుతుందు?

"పిదప అతని నెత్తి మీద సలసలకాగే అగ్ని ద్రవపు శిక్షను కుమ్మరించండి". అని ఆదేశింబడుతుంది. (దుఖాన్: 48) అప్పుడు అతని పరిస్థితి ఎలా ఉంటుందంటే,

"మరుగుతున్న నీటిని అవిశ్వాసులపై కుమ్మరించడం జరిగినప్పుడు, ఆ నీరు వారి తలలను రంధ్రం చేసుకుంటూ శరీరంలోపలి భాగాలన్నింటి నీ మాడ్చి మసి చేస్తుంది. ఆ భాగాలన్నీ మల ద్వారం ద్వారా బయల్పడి అతడి కాళ్ళపై పడతాయి". (ముస్నద్ అహ్మద్)

ఓ మానవుడా! నీకు లభించిన పరిమిత అధికారాన్ని చూసుకొని గొప్పలు పోయేవాడివి కదా! సభల్లో సమావేశాల్లో సన్మానాలు పొందే వాడివి కదా! నీ ఉక్కు పాదాల క్రింద నలిగిపోయిన నిరాధార జీవులు ఎన్నో..ఎన్నెన్నో..! అహింస...అహింస...అంటూనే నువ్వు చేసిన హింసలను... సత్యప్రియులను, శాంతికాముకులను నీవు పెట్టిన చిత్రహింసలు చూడలేక, చూసి తాళలేక ఆకాశం విలపించింది, భూమి ప్రకంపించింది. విశ్వాసులు మంటల్లో పడి కాలిపోయతుంటే నీవు నీ మంది మార్బలమంతా చుట్టూ చేరి వికటాట్టహాసం చేస్తూ వేడుక చూసిన సందర్భం నీకు గుర్తుందా? మరి నీ ప్రభువు ఏమంటున్నాడో: **"(నరక యాతన) రుచి చూడు! నీవు గొప్ప శక్తింతునిలా, మర్యాదస్తునిలా ఉండే వాడివి కదా!"** (దుఖాన్: 49) నరక తేళ్ళ గురించి ప్రస్తావిస్తూ దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: **"అవి గాడిదల్లా ఉంటాయి. ఒకసారి కాటు వేస్తే అవిశ్వాసి నలభై సంవత్సరాల వరకు దాని మంటను భరిస్తూ ఉంటాడు".** (ముస్నద్ అహ్మద్)

"వారి (అవిశ్వాసుల)ని చితకబాదడానికి ఇనుప సుత్తులు కూడా ఉంటాయి"., (అల్‌హజ్జ్: 21) ప్రస్తుతం మనం చూస్తున్న మానవ దేహ దారుఢ్యంలో నర శిక్ష భరించే శక్తి లేదు. కాబట్టి నరకవాసుల శరీరాలను విపరీతంగా పెంచడం జరుగుతుంది. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "నరకంలో అవిశ్వాసి యొక్క ఒక పన్ను ఉహుద్ పర్వతమంతటి ఉంటుంది". (ముస్లిం).

"కొందరు అవిశ్వాసుల చర్మం మూడు రోజుల ప్రయాణం అంత వెడల్పు ఉంటుంది". (ముస్లిం). "కొందరి చర్మం 63 అడుగుల వెడల్పుగా ఉంటుంది". (తిర్మిజీ). కొందరు అవిశ్వాసుల భుజాలు, తొడలు మహా పర్వతాల్ని తలపిస్తుంటాయి". (అహ్మద్). "(కర్మల్ని) బట్టి నరక వాసులు కొందరు ఎంత స్థూలకాయులయి పోతారంటే, వారి చెవుల నుండి – మెడ వెనుక భాగానికి మధ్య గల అంతరం ఏడు వందల సంవత్సరాలంత సుదీర్ఘమయి ఉంటుంది. వారి చర్మపు మందం 70 జానెళ్ళు ఉంటుంది. వారి దవడ ఉహుద్ పర్వతమంత ఉంటుంది".

(అహ్మద్)

'వారి కోసం ఎండిన ముండ్ల గడ్డి తప్ప మరొక ఆహారం ఉండదు. అది బలమూనీయదు, ఆకలినీ తీర్చదు". (గాషియా: 6,7) అది 'గొంతులో ఇరుక్కుపోతుంది'. అప్పుడు నరకవాసి దాన్ని మింగలేక కక్కలేక చస్తాడు. ఆఖరికి అలసిసొలసి అల్లాహ్‌ను నీళ్ళు ఇవ్వమని ప్రాధేయ పడతాడు. నీళ్ళు ఇవ్వబడతాయి. కానీ, **"వారు గనక మంచి నీళ్ళు అడిగితే, నూనె మడ్డిలాంటి నీటితో వారిని సత్కరించడం జరుగుతుంది. అది వారి ముఖాలను మాడ్చి వేస్తుంది. సలసలకాగే ఆ నీరు పేగులని సయితం కోసి వేస్తుంది. ఎంత జుగుప్సారకమయిన శిక్ష అది!"** ఈ విషయమయి మహా ప్రవక్త (స) ఇలా అన్నారు: **"అల్లాహ్ సాక్షి! నాకు తెలిసిన విషయాలు మీరు తెలుసుకుంటే తక్కువగా నవ్వుతారు, ఎక్కువగా ఏడుస్తారు. పడకలపై మీ భార్యలతో సుఖాలు అనుభవించడం మానేస్తారు. ఇంకా అల్లాహ్ శరణు కోరుతూ అడవుల్లోకి, ఎడారుల్లోకి పారిపోతారు".** (ఇబ్ను మాజా)

వివరణగా ముస్నద్ అహ్మద్‌లో ఇలా ఉంది: "ప్రవక్తా! మీరు ఏం చూశారు?" అని సహాబాలు ప్రశ్నించారు. అందుకు దైవప్రవక్త (స) "నేను స్వర్గనరకాలను చూశాను" అన్నారు. వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "నరకం నుండి కాపాడబడాలను కున్న వ్యక్తి ప్రశాంతంగా నిద్ర పోడంగానీ. స్వర్గంలో ప్రవేశించాలనుకునే వ్యక్తి సుఖంగా నిద్రపోవడంగానీ నేను చూడలేదు" అన్నారు ప్రవక్త మహనీయులు (స).

నరకవాసులు మరణాన్ని కోరుకుంటారు. కానీ, ప్రళయ దినాన మరణాన్ని సయితం అంతమొందించడం జరుగుతుంది. "వారి దేహ చర్మం కాలి కరిగిపోయినప్పుడల్లా దాని స్థానంలో మేము మరొక చర్మాన్ని సృష్టిస్తాము. వారు శిక్షను బాగా రుచి చూడాలని".

(అన్నిసా: 56)

ఇక రక్షణ లభించే మార్గం ఏది లేదని గ్రహించిన నరకవాసులు – చివరి ప్రయత్నంగా అల్లాహ్‌తో ఇలా విన్నవించుకుంటారు: "ఓ మా ప్రభూ! మా దౌర్భాగ్యం మమ్మల్ని కప్పేసింది. నిజంగానే మేము మార్గం తప్పినవారము. ఓ స్వామీ! ఇక మమ్మల్ని ఇక్కడ్నుంచి బయటకు తీయి. తరువాత మేము అటువంటి పాపాలు చేస్తే దుర్మార్గులవు తాము". అల్లాహ్ ఇలా సమాధానమిస్తాడు: "నా ముందు నుండి వెళ్ళిపోండి. ఇందులోనే పడి ఉండండి. నాతో మాట్లాడకండి".

(మోమినూన్: 106–108)

సోదరా! మేలుకో, నిన్ను నువ్వు తెలుసుకో. నీ గమ్యసస్థానంపై దృష్టి నిలుపు. సత్కర్మలు చేస్తానని, దుష్కర్మలకు దూరంగా ఉంటానని ప్రతిజ్ఞ చెయ్యి. నీ లెక్కల్ని నువ్వు సరి చూసుకో. ఉన్న వెలితిని పూర్తి చేసుకో. అల్లాహ్ ఎంతో ప్రేమగా ఇస్తున్న ఈ పిలుపుని సదా గుర్తుంచుకో!

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. ప్రతి వ్యక్తీ తాను రేపటి కొరకు ఏమి సమకూర్చాడో చూసుకోవాలి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు. అల్లాహ్‌ను మరచిపోయిన వారిలా మీరు అయిపోకండి. అల్లాహ్ మరచిపోవడంవల్ల అల్లాహ్ వారిని తమని తాము మరచిపోయేలా చేశాడు".

(హష్ర్: 18,19)

'విశ్వసించిన ప్రజలారా! మీరు మిమ్మల్ని, మీ కుటుంబీకుల్ని నరకాగ్ని నుండి కాపాడుకోండి". (తహ్రీమ్:6)

(గత సంచిక తరువాయి భాగం)

కుటుంబ జీవనం మరియు ఇస్లాం

ఆశ్చర్యమేమంటే, కొన్ని మతాల్లో ప్రాపంచిక జీవనం అంటే సంసార జీవితాన్ని పూర్తిగా త్యజించడమే. దాన్ని ఒక పాపంగా పేర్కొనడం జరిగింది. కొన్ని మతాల బోధకులు ప్రజలను **'ఓ పాపులారా'** అని సంబోధించారు. కొందరు బోధకులు సంసారజీవితాన్ని పాప పంకిలంగా పేర్కొన్నారు.

కాని, ఇస్లాం సంసార జీవితాన్ని దేవుడిచ్చిన వరంగా పేర్కొంటుంది. సంతానాన్ని దేవుని కారుణ్యంగా పేర్కొంటుంది. మానవులంతా ఆదం(అ) సంతానంగా తెలియజేస్తుంది. ప్రాపంచిక జీవితం పర లోకానికి సంబంధించిన ఒక పరీక్ష అని పేర్కొన్నది. ఎంత చక్కని బోధనలివి.

కొన్ని మతాలు ప్రపంచమలోని సంబంధ బాంధవ్యాలు భ్రమలుగా చెబుతూ వాటి పట్ల అపనమ్మకాన్ని కలిగిస్తాయి. కాని ఇస్లాం ప్రకారం ప్రజలు దేవుని ఉనికిని, ఆయన సృష్టించిన వాటి ఉనికిని విశ్వసించాలి, ప్రపంచం, ప్రపంచంలోని సంబంధ బాంధవ్యాలు అన్నీ అందులో ఉన్నాయి.

కాబట్టి ఇస్లాం సమాజంలో ప్రశాంతతా పవనాలను వీచేలా చేస్తుంది. ఒండొకరుల పట్ల విశ్వాస నమ్మకాలు దృఢమయ్యేలా చేస్తుంది.

ఇతర మతాల మాదిరిగా కాక, ఇస్లాం ఒక సంపూర్ణ జీవనవిధానం. మత విశ్వాసం విశ్వాసులకు, అవిశ్వాసులకు సంబంధించిన చరిత్ర పాఠాలు; హితోపదేశాలు; సాంస్కృతిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సమస్యలకు చక్కని పరిష్కారాలు; మానవ కల్పిత చట్టాల చట్రంలో ఉండే జీవితానికి సంబంధించిన సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. అదీగాక ఇస్లాం సోషలిస్టులు, న్యాయనిపుణులు, చట్ట నిపుణులు ప్రతిపాదించే సూత్రాలకు, చట్టాలకు భిన్నంగా కొత్త సూత్రాలను కూడా ప్రతిపాదిస్తుంది.

ఇస్లాం సత్యపథాన్ని చూపే ఏకైక ధర్మం. శాంతి, సత్యం, న్యాయం, ఆనందం నిండిన స్థిరమైన జీవనాలను అందుకొమ్మని పిలుపునిస్తుంది ఇస్లాం. ఇతర మతాల గ్రంథాలు, మత నాయకుల బోధనలు చదివినట్లయితే మనకు కొన్ని పరిమిత విషయాలకు సంబంధించి చేయదగిన పనులు, చేయకూడని పనుల గురించి మాత్రమే తెలుస్తుంది.

కాని ఇస్లాంలో ప్రతి విషయానికి సంబంధించిన, మనిషి జీవితంలో ప్రతి దశకు సంబంధించిన ఉపదేశాలు లభిస్తాయి. పిల్లలు, యువకులు, వివాహిత స్త్రీ పురుషులు, వర్తకులు, సైనికులు, అన్ని విధాల వృత్తుల్లో ఉన్నవారు– అందరూ ఇస్లాం నుంచి స్పష్టమైన, వివేకవంతమైన సలహా సూచనలు పొందగలరు. వాటి ద్వారా ఆనందభరిత జీవనాన్ని సాధించుకోగలరు.

సూర్యోదయానికి ముందు శుభ్రమైన శరీరంతో చేసే ఫజర్ నమాజ్ మీ అనుభవంలోకి వస్తే మీరు ఎంతో ఆనందం చవి చూస్తారు. ఆ ఆనందం రాత్రి (ఇషా) నమాజు వరకు కొనసాగుతుంది. చేయదగిన పనుల హితవులు, చేయకూడని పనుల ఆదేశాలు మనిషిని చెడుల నుంచి నిరోధించి సమాజం కోసం ఒక ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి.

రమజాన్ నెలలో ఉపవాసాలు మనిషి శరీరంలో,మస్తిష్కంలో రసాయనాల మార్పులకు గురిచేసి ఆరోగ్యాన్ని వృద్ధి చేస్తాయి. ధనికులు జకాత్ (పేదల ఆర్థిక హక్కు) చెల్లించడం వల్ల సమాజంలో దయ, కారుణ్యాలు విస్తరిస్తాయి. పొరుగు వారి పట్ల, తోటి వారి పట్ల ప్రేమానుబంధాలు వెల్లివిరుస్తాయి. ఇతరులకు ఇవ్వడం వల్ల లభించే ఆనందం ఆత్మకు ప్రశాంతత చేకూరుస్తుంది. మనస్సును ప్రక్షాళనం చేసి మోదభరితం చేస్తుంది. జకాత్ అంటేనే ప్రక్షాళనం, పరిశుభ్రత అని అర్థం.

కాబట్టి ఇస్లాం మిమ్మల్ని అత్యుత్తమ ఆదర్శాన్ని ఆచరించే అనుభవాన్ని రుచి చూడమని పిలుస్తోంది. ప్రపంచంలో విశ్వాసులు అనుభవించే కష్టాలను సాఫల్యంగా నిరూపించబడిన విధానం ఉంది ఇందులో.కొత్తమతాన్ని అవలంబించే విషయంలో ప్రతి మనిషిలో తటపటాయింపు ఉంటుంది. నిజమే. కాని ఇస్లాంను అవలంబించడమంటే కొత్త మతంలోకి మారడం కాదు. మనిషి తన పాత ధర్మాన్ని మళ్ళి స్వీకరించడమే. ఎందుకంటే ఇస్లాం మనిషికి సంబంధించిన మొట్టమొదటి ధర్మం.

ఏక దేవుని ఆరాధనతోనే "ఆరాధనల" చరిత్ర మొదలవుతుంది. మనిషి పూజలు చేస్తున్నప్పుడు అతని మనస్సులో 'ఒకేదేవుడు' ఉంటాడు. ఒకే దేవుడు అనే విశ్వాసాన్ని అంగీకరించిన ప్రతి వ్యక్తీ ఇస్లాం పరిధిలోకి వచ్చినట్లే.

మనిషి తన దుస్తులు, అలంకరణ సామగ్రి ఇతర వస్తువుల విషయంలో కొత్తవాటిని పొందాలనుకుంటాడు. ప్రభుత్వం వాటన్నిటికి సంబంధించిన అభివృద్ధి కోసం చట్టం చేస్తే అతను వెంటనే అంగీకరించి దానికి మద్దతిస్తాడు. అలాంటప్పుడు మనిషికి, అతని కుటుంబానికి శాశ్వత సుఖసంతోషాలు అందించే సత్యపథాన్ని (ఇస్లాం) ఎందుకు అంగీకరించ కూడదు!

మనిషి ఇస్లాం స్వీకరించగానే ప్రాపంచిక వస్తుసామగ్రి, కల్పిత గాధలకు భిన్నంగా అతని నిజ దైవం పట్ల విశ్వాసాన్ని చాటిచెప్పే అందమైన పేరుగా మారిపోతుంది. అంతేకాదు, అతని మత విశ్వాసం 'ఈమాన్' దృఢంగా ఉంటుంది. విశ్వాసం విషయంలో దృఢత్వాన్ని ప్రసాదిస్తుంది.

ఇస్లాంను అవలంబిస్తే, అయిదు పూటల నమాజు వల్ల మనిషి మస్తిష్కం, శరీరం మాలిన్యాలకు దూరం అవుతుంది.

మనిషి ఇస్లాం స్వీకరిస్తే అతడి వృత్తి, ఉద్యోగ, వ్యాపార వ్యాపకాలు భౌతిక ప్రయోజనాలకు మాత్రమే పరిమితమై ఉండవు. ఇస్లాంలోని హరాం, హలాల్, మంచీచెడు నియమనిబంధనల కారణంగా ఒక న్యాయబద్ధమైన, బాధ్యతాయుతమైన వ్యక్తిగా అతడి నడవడిక ఉంటుంది.

ఇస్లాం స్వీరకణతో మనిషి సంసార జీవితం ఇతరులకు ఆదర్శంగా మారుతుంది. ఇస్లాంలో సంసార జీవితానికి సంబంధించి ఆదేశాలు ఎన్నో ఉన్నాయి. అదీగాక అతని సంతానం అత్యుత్తమ సంతానంగా పెరుగుతుంది. పిల్లలను అత్యుత్తమ రీతిలో పెంచే సూత్రాలు ఇస్లాంలోనే ఉన్నాయి.

దేవుని పేరుతో నేను మీ అందర్నీ సత్యపథానికి మరలి రమ్మని పిలుస్తున్నాను. ఈ పవిత్ర భావం మీ మనోమస్తిష్కాల్లో ప్రవేశించ నీయండి. మనోమస్తిష్కాలను సృష్టించింది దేవుడే. ఆయన మనిషికి సత్యమార్గాన్ని ఎన్నుకొని ఆచరించే స్వేచ్ఛ కూడా ప్రసాదించాడు.

('ఇస్లాం పిలుపు' పుస్తకం నుండి)

సువర్ణ మాసం రమజాన్

అల్హమ్దులిల్లాహ్ రమజాను మాసంలో నాకు తెలియని అనేక విషయాలు తెలుసుకున్నాను. ఐపిసికి వచ్చిన విద్యార్థులతో కలిసి ఇఫ్తార్ చేయడం, చిన్నాపెద్దా, ధనికుడు నిరుపేద అన్న భేదము లేకుండా అందరితో కలిసమెలిసి ఉండటం ఎంతో ఆనందాన్నిచ్చింది. దీనికి తోడు ఇస్లాం ధర్మానికి, దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవితానికి, ఖుర్ఆన్ గ్రంథానికి సంబంధించిన అనేక విషయాలను ఈ రమజాను పూర్తి నెలపాటు మా విద్యార్థులందరికీ ఎంతో చక్కగా ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేటట్లు గురువు గారు ఎంతో శ్రద్ధగా తెలియజేశారు. నమాజు, రోజాల ప్రాశస్త్యంతోపాటు ప్రవక్తల గాథల గురించి సుస్పష్టంగా తెలియజేయడం నాకెంతో మధురానుభూతినిచ్చింది. ఈ రమజాను మాసాన్ని ముఖ్యంగా నా పాలిట వరంగా భావిస్తున్నాను. నా వల్ల జరిగి చిన్నాచితకా తప్పులను దిద్దుకుని ఆత్మ ప్రక్షాళనంగావించుకునేందుకు నిజంగా రమజాను మాసం ఓ సువర్ణావకాశం. అలాగే రమజాను మాసంలోని ఖుర్ఆన్ పారాయణాలు, తరావీహ్ నమాజులు, సహరీ, ఇఫ్తార్లు వాస్తవంగా రమజాను మాసపు ప్రతి ఘడియ అల్లాహ్ మానవాళికి ప్రసాదించిన మహదానుగ్రమే. మా విద్యార్థుల విషయంలో ఇంత శ్రద్ధ చూపిన ఐపిసి యాజమాన్యానికి,గురువులకు నిండు హృదయంతో ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

–అబ్దుల్లాహ్ (నాగరాజా)

నెలవంక ఉత్తరాలు

విశ్వకర్త మెచ్చిన ధర్మం ఇసస్లాం

ఈ సంవత్సరం రమజాను మాసం ప్రారంభానికి రెండు రోజుల ముందు అల్లాహ్ అనుగ్రహంతో నేను మనస్ఫూర్తిగా ఇష్టపడి ఇస్లాం స్వీకరించాను. ఎంతో మంది నన్ను ప్రేమతో ఆహ్వానించారు.

ఇస్లాం స్వీకరించినప్పటి నుంచి ఐపిసి ఆధ్వర్యంలో ఇస్లాం శిక్షణ గరిపే నిమిత్తం ప్రతి రోజు రావడం జరిగింది. ఇక్కడ ఇస్లాం స్వీకరించినటువంటి మిత్రులు పరిచయం కావడంతోపాటు మంచి బోధకులు పరిచయం అవడం వారి ద్వారా రమజాన్ మాసంలో ఎన్నో విషయాలు తెలుసుకోవడం జరిగింది. ముఖ్యంగా దేవుని గురించిన సుస్పష్టమయిన వివరణ, ఆయన శక్తిసామర్థ్యాల, గుణవిశేషాల విశ్లేషణ బహు చక్కగా జరిగింది. దాసులమైన మనం దేవుని పట్ల ఎలాంటి కృతజ్ఞతా భావన కలిగి ఉండాలో, ఎలాంటి ఆచరణలు పాటించాలో, ఏ విధానం దైవానికి నచ్చుతుందో తెల్పడం జరిగింది.

ఇస్లాం అంటే – అది ఒక కులానికి, ప్రాంతానికి, దేశానికి, భాషకి పరిమితమయిన మతధర్మం కాదు. అదివిశ్వమానవాళి పాలిట విశ్వకర్త మెచ్చి పంపిన శాంతి సందేశం అని తెలుసుకో గలిగాను.

ఖుర్ఆన్ ఘనతావిశిష్టతలతోపాటు మనిషి ఎలాంటి విలువలు కలిగి జీవంచాలన్న విషయమూ బోధ పడింది. ఇటువంటివి ఎన్నో ఇంకెన్నో విషయాలు ఐపిసి క్లాసులకి హాజరు అవ్వడం వల్ల తెలుసుకోగలిగాను.

సోదరులారా! కువైట్‌లో మన తెలుగు వారి కోసం ఎంతో కృషి, పట్టుదలతో శ్రమించి మన కోసం అనేక విషయాలను **నెలవంక** రూపంలో వెలుగులోకి తీసుకురావడం జరుగుతోంది. కాబట్టి ముస్లిములే కాకుండా ముస్లిమేతర సోదరులు కూడా చదివి విలువైన విషయాలు తెలుసుకొని వ్యక్తిగత జీవితంతోపాటు సామాజిక జన జీవనంలో సయితం వెలుగు నింపుతారని ఆశిస్తున్నాను. చివరిగా ఇటివంటి బృహత్కార్యానికి పూనుకున్న ఐపిసి యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలతోపాటు అల్లాహ్ అడుగడుగునా వారికి అండగా నిలవాలని కోరుకుంటున్నాను.

– అబ్దుర్రహ్మాన్ (సుధాకర్)

మధుర ఘట్టం

అస్సలాము అలైకుమ్ నా పేరు అబ్దుల్ అజీజ్ రమజాను మాసానికి 12 రోజుల ముందు నేను ఇస్లాం స్వీకరించాను. ఇస్లాం స్వీకరించక ముందు నాకు ఏమీ తెలియదు. ఆ తర్వాత గురువుగారి పర్యవేక్షణలో ఐపిసికి వచ్చి ఇస్లాం గురించి తెలుసుకున్నాను.

మరువలేని మధుర ఘట్టం:

'అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు' – అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్యుడు ఎవడూ లేడని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఆయన దాసుడు మరియు ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని నా చేత మా నాన్నగారు సాక్ష్యం చెప్పించిన క్షణాలు జీవితంలో మరచి పోలేనివి. ఇటువంటి రోజు కోసమే ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూసిందా నా హృదయం అన్పించింది. అలా నా జీవితంలో ఓ నూతన అధ్యాయం ప్రారంభమయింది.

విశ్వాసులకు పండుగ లాంటి దినం శుక్ర వారం. అదే రోజున నేను సూరతుల్ ఫాతిహా కంఠస్థం చేసి గురువుగారికి విన్పించాను. శుక్రవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసేవాడను. ఐపిసి క్లాసులకు వచ్చే విద్యార్థులతో నాకు మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. వారు నాపై చూపించే ప్రేమ నాకు నచ్చింది. ఒక కుటుంబ వాతావరణం లాంటి అనుభూతి కలిగేది. ఆ తర్వాత వరాల వసంతమయిన రమజాను మాసం వచ్చింది. మొద టిసారి నా జీవితంలో 16గంటలు ఏమి తిన, త్రాగకుండా ఉండగలనన్న ఆత్మ విశ్వాసం కలిగింది.

అబ్దుల్ అజీజ్ (శివ కుమార్)

ఆంధ్ర భూమి-ఇది ఆంధ్రభూమి

వివిధ సంస్కృతులు రెమ్మలు సాచి వికసించిన పుణ్య భూమి



మన గత చరిత్ర ఎంత ఖ్యాతి

గర్వించదగ్గ జాతి తెలుగు జాతి

